

రంజాన్ వేళలు
ఇఫ్తార్: 6:34 (శనివారం సాయంత్రం)
సహర్: 4:50 (ఆదివారం ఉదయం)

సరఫరా.. స్లో!

అరకొరగా డీలర్ల వద్దకు చేరుతున్న సన్నబియ్యం

- రేషన్‌షాపులకు ఇంకా ఖరారు కాని కేటాయింపులు
- ఏప్రిల్ 1వతేదీ నుంచి పంపిణీకి ప్రభుత్వం సిద్ధం
- జిల్లా వ్యాప్తంగా 558 దుకాణాలు.. 163 షాపులకు చేరిన స్టాక్
- మొత్తం తెల్లరేషన్ కార్డులు 2,41,012





మహబూబాబాద్ అగ్రికల్చర్, మార్చి 28 (ఆంధ్రజ్యోతి) : రేషన్ దుకాణాల ద్వారా పేదలకు సన్న బియ్యం అందించాలని ప్రభుత్వం సంకల్పించింది. ప్రజాపంపిణీ వ్యవస్థ ద్వారా ఏప్రిల్ 1వ తేదీ నుంచి ఈ రైస్‌ను అందజేస్తామని సర్కారు తెలుపగా.. ఆయా దుకాణాలకు అలాట్‌మెంట్ మాత్రం జరుగలేదు. పౌరసరఫరాల శాఖ కమిషనర్ నుంచి మహబూబాబాద్ జిల్లాకు కేటాయింపులు రాకపోవడంతో జిల్లా అధికారులు రేషన్‌షాపులకు సన్నబియ్యం కేటాయింపులు చేయలేదు. దాని ఫలితంగా అరకొరగా లారీలను ఎంఎల్ఎస్ పాయింట్‌లకు సన్నబియ్యం చేరుతున్నాయి. జిల్లాలోని 558 రేషన్‌షాపులకు గాను బుధవారం మధ్యాహ్నం వరకు 163 షాపులకే నామమాత్రంగా రైస్ చేరాయి.

ఇంకా అందని అలాట్‌మెంట్..

తెలంగాణ రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం పేదలకు సన్నబియ్యం అం దించాలని కృతనిశ్చయంతో ఉంది. ఉగాది పండుగకు ఈ సన్నబియ్యం పథకం పంపిణీ ముహూర్తం ఖరారు చేసింది. అయితే హైదరాబాద్ పౌరసరఫరాల కమిషనర్ నుంచి జిల్లాకు బియ్యం అలాట్‌మెంట్ జరగాల్సి ఉండగా, బుధవారం మధ్యాహ్నం వరకు ఎలాంటి కేటాయింపులు వచ్చినట్లు ఉత్తర్వులు అందలేదు. దీంతో జిల్లా పౌరసరఫరాల శాఖ నుంచి జిల్లాలోని రేషన్ షాపులకు బియ్యం అలాట్‌మెంట్ ఇవ్వలేదు. జిల్లాలో 558 రేషన్‌షాపులు ఉండగా.. 2,41,012 తెల్లరేషన్‌కార్డులు, ఇతర రేషన్‌కార్డులు ఉన్నాయి. జనాభా ప్రాతిపదికన ఒక్కొక్కరికి 6 కిలోల చొప్పున బియ్యం పంపిణీ చేయాల్సి ఉంటుంది. 45,616.600 క్విం టాళ్ల రేషన్ బియ్యం కార్డుదారులకు పంపిణీ చేయాల్సి ఉంది. అలాట్‌మెంట్ కానీ కారణంగా గత నెల క్రితం జరిగిన అలాట్‌మెంట్ ప్రకారమే తాత్కాలికంగా మాన్యువల్ పద్ధతిలో అలాట్‌మెంట్ చేస్తున్నారు.

వచ్చేనెల 1వ తేదీ నుంచి గత ప్రభుత్వం రేషన్ బియ్యం ఇచ్చిన పద్ధతిని పక్కకు పెట్టిన ప్రభుత్వం కొత్తగా అలాట్‌మెంట్ చేసి సన్నబియ్యం ఇవ్వడానికి సమాయత్తం అవుతుంది. దాని ప్రకారమే అలాట్‌మెంట్ కూడా చేయనున్నారు. దొడ్డు బియ్యం తీసుకోని ప్రజలు ఈ సన్నబియ్యం తీసుకునేందుకు సిద్ధంగా ఉండడంతో అలాట్‌మెంట్ కూడా పెరిగే అవకాశాలు కన్పిస్తున్నాయి.

అరకొరగానే..

రేషన్‌షాపులకు బియ్యం అలాట్‌మెంట్ రాకపోవడం, ఏప్రిల్ 1వ తేదీ దగ్గర పడుతుండడంతో జిల్లా యంత్రాంగం ముందుగా సన్నబియ్యం రేషన్‌షాపులకు తరలిస్తున్నారు. బుధవా రం మధ్యాహ్నం వరకు కేసముద్రం ఎంఎల్ఎస్ పాయింట్‌కు రెండు లారీల సన్నబియ్యం బఫర్‌గోదాం నుంచి చేరాయి. మహబూబాబాద్ ఎంఎల్ఎస్ పాయింట్‌కు 5 లారీలు, గార్ల ఎంఎల్ఎస్‌పాయింట్‌కు ఒక లారీ, కొత్తగూడ ఎంఎల్ఎస్ పాయింట్‌కు ఒక లారీ, తొర్రూరు ఎంఎల్ఎస్ పాయింట్‌కు 5 లారీలు చేరగా మరిపెడలో 15 లారీల సన్నబియ్యం నిల్వలు ఉన్నాయి. అయితే మరిపెడలో 15 లారీల పాత సన్నబియ్యం నిల్వలు ఉన్నాయి.

కేసముద్రం ఎంఎల్ఎస్ పాయింట్ పరిధిలో కేసముద్రం, నెల్లికుదురు, గూడూరు పరిధిలో 85 రేషన్‌షాపులు ఉన్నాయి. వచ్చిన లారీల్లో నుంచి 12 రేషన్ దుకాణాలకు సన్నబియ్యం సరఫరా చేశారు. కొన్ని షాపులకు 25 క్వింటాళ్లు, మరికొన్ని షాపులకు 30 క్వింటాళ్ల చొప్పున సరఫరా చేశారు. మహబూబాబాద్ పరిధిలో మహబూబాబాద్, కురవి మండలాలకు గాను 117 షాపులు ఉండగా ఇప్పటి వరకు 33 షాపులకు సన్నబియ్యం సరఫరా చేశారు. గార్లలో బయ్యారం, డోర్నకల్, గార్ల పరిధిలో 95 రేషన్‌షాపులు ఉండగా 13 షాపుల్లో 30నుంచి 35 క్వింటాళ్ల వరకు సన్నబియ్యం తరలించారు.



కేసముద్రం ఎంఎల్ఎస్ పాయింట్‌లో నిల్వ ఉన్న సన్నబియ్యం బస్తాలు

కొత్తగూడ ఎంఎల్ఎస్ పాయింట్ పరిధిలో కొత్తగూడ, గంగారం, గూడూరు (గూడూరు పాక్షికం)గా ఉండగా మొత్తం వెరసి 69 షాపులు ఉన్నాయి. ఇప్పటి వరకు 22 షాపుల్లో సన్నబియ్యం తరలించారు. మరిపెడ పరిధిలో మరిపెడ, చిన్నగూడూరు, దంతాలపల్లి, నర్సింహులపేటలలో 110 రేషన్‌షాపులు ఉండగా.. సాయింత్రం వరకు 50 షాపులలో సన్నబియ్యం తరలించనున్నారు. ఒక్కొక్క షాపుకు 25 నుంచి 30 క్వింటాళ్ల వరకు బియ్యం సరఫరా చేశారు. తొర్రూరు పరిధిలో తొర్రూరు, పెద్దవంగర, నెల్లికుదురు మండలాల్లో 82 షాపులు ఉండగా 25 షాపులకు వరకు చిన్న షాపులకు 10 క్వింటాళ్ల, పెద్ద షాపులకు 25 క్వింటాళ్ల చొప్పన బియ్యం సరఫరా చేసినట్లు తెలుస్తోంది.

శనివారం మాత్రమే బియ్యం రవాణా చేసేందుకు అవకాశం ఉంది. ఈనెల 30న ఉగాది, 31న రంజాన్ పర్వదినం సందర్భంగా బియ్యం తరలించే అవకాశం లేదు. ఈ క్రమంలో అన్ని షాపులకు బియ్యం సరఫరా చేయాల్సి ఉంది. కాగా, ఈ విషయంపై జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారులను వివరణ కోరేందుకు ప్రయత్నించగా అందుబాటులోకి రాలేదు.

రంజాన్ పండుగ నమాజ్ వేళలు

- మానుకోటలోని పాత బజారు ఈద్గాలో 9 గంటలకు..
- కొత్త బజారు ఈద్గాలో 9:30లకు
- నిర్ణయించిన ముస్లిం మత పెద్దలు



కొత్తబజారు మస్జిద్‌లో సమావేశమైన ఈద్గాలు, మస్జిద్ కమిటీలు

మహబూబాబాద్, మార్చి 28 (ఆంధ్రజ్యోతి) : మానుకోట పట్టణంలో ఈనెల 31న జరగనున్న రంజాన్ (ఈద్-ఉల్-ఫితర్) నమాజ్ వేళలను అన్ని మస్జిద్‌ల కమిటీల పెద్దలు, ఈద్గాల కమిటీల పెద్దలు ఏకగ్రీవంగా శుక్రవారం సమయం ఖరారు చేశారు. పాత బజారులోని ఈద్గాలో ఉదయం 9 గంటలకు, కొత్తబజారులోని ఈద్గాలో ఉదయం 9.30 గంటలకు ఈద్-ఉల్-ఫితర్ రంజాన్ నమాజ్ చదవాలని నిర్ణయించారు. ఈసారి మస్జిద్‌లలో నమాజ్ చదివే అవకాశం లేదని ఆయా కమిటీలు ప్రకటించాయి. ఇస్లాహే మాషేరా కమిటీ అధ్యక్షులు మహ్మద్‌ఇక్బాల్ సమన్వయకర్తగా నిర్వహించిన ఈ సమావేశంలో పాత బజార్ ఈద్గా అధ్యక్షుడు ఎండీ అసద్‌అలీఖాన్, కొత్త బజార్ ఈద్గా అధ్యక్షుడు ఎండీ ఇబ్రహీంఅలీ, మస్జిదే మహబూబియా, నూర్ మస్జిద్, మస్జిదే గౌసియా, మస్జిదే ఉమర్ ఫరూక్, మస్జిదే దీనిదర్గా, తదితర మస్జిద్‌ల బాధ్యులు ఎండీ ఇస్మాయిల్, రహీం, ఖలీల్, అమీర్, ఫరీద్, అస్లాం, జాకీర్ హుస్సేన్, సాబీర్, సయ్యద్ అహ్మద్, అఫ్సర్, మొబిన్, షకీల్, ఫజల్, నజీర్, వాహెద్, అమీర్‌ఖాన్, యూసఫ్, షంషోద్దీన్, ఖాలీద్, దస్తగిరి పాల్గొన్నారు.

మానుకోట మార్కెట్‌కు నాలుగు రోజులు సెలవు

మహబూబాబాద్ అగ్రికల్చర్, మార్చి 28 (ఆంధ్రజ్యోతి) : మహబూబాబాద్ వ్యవసాయ మార్కెట్‌కు శనివారం నుంచి నాలుగు రోజుల పాటు సెలవులు ప్రకటించినట్లు చైర్మన్ ఇస్లావత్ సుధాకర్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. 29న అమావాస్య, 30న ఆదివారం ఉగాది, 31న సోమ, మంగళవారాల్లో రంజాన్ పండుగ సందర్భంగా మార్కెట్‌కు సెలవులు ప్రకటించినట్లు పేర్కొన్నారు. సెలవుదినాల్లో మార్కెట్ యార్డుకు సరుకులు తీసుకువచ్చి ఇబ్బందులకు గురికావొద్దని చైర్మన్ రైతులకు విజ్ఞప్తి చేశారు. తిరిగి బుధవారం 2వ తేదీన మార్కెట్ పునఃప్రారంభమవుతుందని తెలిపారు.

కేసముద్రంలో..

కేసముద్రం, (ఆంధ్రజ్యోతి) : కేసముద్రం వ్యవసాయ మార్కెట్‌కు ఈనెల 29 నుంచి వచ్చేనెల 1 వరకు సెలవులు ఉన్నట్లు చైర్మన్ గంట సంజీవరెడ్డి తెలిపారు. ఈనెల 29న అమావాస్య, 30న ఉగాది, 31న రంజాన్ పండుగలు, 1న రంజాన్ పండుగ మరుసటి రోజు సందర్భంగా సెలవులు ఉన్నాయని, రైతులు గమనించి తమ సరుకులను వచ్చేనెల 2న తీసుకురావాలని కోరారు.

మానుకోట బార్ అసోసియేషన్ అధ్యక్షుడిగా ప్రేమ్‌చందర్

ప్రధాన కార్యదర్శిగా ఎన్నికైన సిద్ధార్థ ఎన్నిక



ప్రేమ్‌చందర్



సిద్ధార్థ

మహబూబాబాద్ రూరల్, మార్చి 28(ఆంధ్రజ్యోతి): మహబూబాబాద్‌జిల్లా కోర్టు బార్ అసోసియేషన్ నూతన అధ్యక్షుడిగా ఎ.ప్రేమ్‌చందర్, ప్రధాన కార్యదర్శిగా జె.సిద్ధార్థలు ఎన్నికైనట్లు ఎన్నికల అధికారులు జి.కమలాకర్, వి.సుభాష్ శుక్రవారం తెలిపారు. ఉపాధ్యక్షుడిగా సురేష్, సహాయ కార్యదర్శిగా హరికృష్ణ, లైబ్రైరీ కార్యదర్శిగా కె.దర్గయ్య, కోశాధికారిగా చిన్న మహేందర్, స్పోర్ట్స్, కల్చరల్ కార్యదర్శిగా కె.మున్నా, కార్యవర్గ సభ్యులుగా మౌనిక, సునీత, భాస్కర్ ఎన్నికైనట్లు వెల్లడించారు.

పట్టాదారు పాస్‌పుస్తకాల్లో సవరణకు అవకాశం ఉంది



తాళ్లూరి దామోదర్
తహసీల్దార్, కేసముద్రం

ఫటాఫట్

ఆంధ్రజ్యోతి : భూమి కాస్తులో ఉండి, పట్టాదారు పాస్‌పుస్తకం లేని వారు ఎలా పొందాలి?

తహసీల్దార్ : ప్రస్తుతానికి ఇలాంటి అవకాశం లేదు. ప్రభుత్వం నుంచి ఆదేశాలు వస్తే చేస్తాం.

ఆంధ్రజ్యోతి : పట్టాదారు పాస్‌పుస్తకంలో విస్తీర్ణం తక్కువగా నమోదైన వారు ఎలా సరిచేసుకోవాలి?

తహసీల్దార్ : ఆన్‌లైన్‌లో ధరణి పోర్టల్ ద్వారా 'టీం 33' మాడ్యుల్‌లో దరఖాస్తు చేసుకుంటే విచారణ జరిపి సరిచేస్తారు.

ఆంధ్రజ్యోతి : పట్టాదారు పాస్‌పుస్తకంలో పేరు, కులం, ఇతర వివరాలను సరిచేసుకోవాలంటే ఎలా?

తహసీల్దార్ : ధరణి పోర్టల్‌లో 'ఫస్ట్‌పేజ్ జీఎల్ఎం' మాడ్యుల్ కింద ఆన్‌లైన్‌లో తగిన ఆధారాలతో దరఖాస్తు చేసుకుంటే వివరాలు పరిశీలించి సవరణ చేస్తాం.

ఆంధ్రజ్యోతి : పట్టాదారు పాస్‌పుస్తకంలో సర్వే నెంబరు తప్పుగా నమోదైన వారు ఎలా సరిచేసుకోవాలి?

తహసీల్దార్ : అలా జరగడం చాలా అరుదు. ఒకవేళ తప్పుగా నమోదైతే భూమిని సర్వే చేయించి, ఆ నివేదిక ఆధారంగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి.

ఆంధ్రజ్యోతి : భూమిని తెల్లకాగితం ద్వారా కొనుగోలు చేసిన వారు పట్టాదారుపాస్‌పుస్తకం పొందాలంటే ఎలా?

తహసీల్దార్ : తెల్లకాగితం (సాదాబైనామా) ద్వారా పట్టాదారు పాస్‌పుస్తకాల జారీ కోసం ప్రభుత్వం నుంచి ఆదేశాలు రాలేదు. మళ్లీ ప్రభుత్వం అవకాశం ఇచ్చినప్పుడు దరఖాస్తు చేసుకోవాలి.

- కేసముద్రం (ఆంధ్రజ్యోతి)

ఇందిరమ్మ ఇళ్ల ప్రక్రియను వేగవంతం చేయాలి

- బేస్‌మెంట్ పూర్తయిన ఇళ్లకు తక్షణమే చెల్లింపులు
- వేసవిలో ఏ గ్రామంలో తాగునీటి సమస్య రాకుండా చూసుకోవాలి
- జూన్‌లో వరంగల్ సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి పూర్తి
- మడికొండ డంపింగ్‌యార్డుకు శాశ్వత పరిష్కారం చూస్తున్నాం
- ఉమ్మడి వరంగల్ జిల్లా సమీక్షలో మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి



సమీక్ష సమావేశంలో పాల్గొన్న మంత్రులు పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, సురేఖ, సీతక్క, తదితరులు

7

తీరనున్న రైతుల కరెంట్ కష్టాలు



హైదరాబాద్ సచివాలయంలో నిర్వహించిన ఉమ్మడి వరంగల్ జిల్లా సమీక్షలో మంత్రులతో హాజరైన మహబూబాబాద్ ఎమ్మెల్యే భూక్య మురళీనాయక్

- ఎమ్మెల్యే మురళీనాయక్ చొరవతో ఏజెన్సీ గ్రామాలకు రూ.7కోట్ల నిధులు
- ఉమ్మడి జిల్లాల ఎమ్మెల్యేల సమీక్షలో మంత్రి సురేఖ హామీ

మహబూబాబాద్, మార్చి 28 (ఆంధ్రజ్యోతి) : మహబూబాబాద్ నియోజకవర్గంలోని గూడూరు మండలం ఏజెన్సీ గ్రామాలైన మచ్చర్ల, మట్టెవాడ, నేలవంచ రైతుల కరెంట్ కష్టాలు గట్టెక్కనున్నాయి. హైదరాబాద్ సచివాలయంలో శుక్రవారం ఉమ్మడి వరంగల్‌జిల్లా ఎమ్మెల్యేలసమీక్ష సమావేశంలో మహబూబాబాద్ శాసనసభ్యుడు భూక్య మురళీనాయక్ మాట్లాడుతూ.. ఏజెన్సీ గ్రామాలైన మచ్చర్ల, మట్టెవాడ, నేలవంచ గ్రామాలకు స్వాతంత్ర్యం వచ్చి 75 ఏళ్ల దాటినా రైతుల కరెంట్ కష్టాలు తీరడం లేదని, చుట్టు అటవీ ఉండడంతో ఫారెస్టు అధికారుల నుంచి క్లియరెన్స్ రాక ఆయాగ్రామాల పంట పొలాలకు విద్యుత్ సరఫరా జరగడం లేదని వివరించారు. ఫలితంగా పంట పొలాలు ఎండిపోతున్నాయని, ఈ విషయమై తాను స్వయంగా రాష్ట్ర అటవీశాఖ భవనానికి వెళ్లి పలుమార్లు పర్వేష్‌యాప్ అప్‌లోడ్ చేయించానని చెప్పారు. అదిమంజూరు కావాలంటే రూ.7 కోట్లు విద్యుత్‌శాఖకు అటవీశాఖ అధికారులు కేటాయించాల్సి ఉంటుందని చెప్పారు. ప్రభుత్వం వద్ద నిధులు లేకపోవడంతో ఆయా ఏజెన్సీ గ్రామాలకు కరెంట్ కష్టాలు తీరడం లేదని వాపోయారు. దీంతో స్పందించిన అటవీ, దేవాదాయశాఖ మంత్రి కొండా సురేఖ తన సొంత నిధుల నుంచి రూ.7 కోట్లు కేటాయించి రైతుల కరెంట్ కష్టాలకు శాశ్వత పరిష్కారం చూపుతానని హామీ ఇచ్చారు. దీంతో గిరిజన గ్రామాల ప్రజల తరుపున ఎమ్మెల్యే భూక్య మురళీనాయక్ మంత్రికి కృతజ్ఞతలు తెలిపారు. వెంటనే కేటాయింపులు జరిగేలా చూడాలని కోరారు.

తహసీల్దార్ కార్యాలయాన్ని తనిఖీ చేసిన అదనపు కలెక్టర్

డోర్నకల్, మార్చి 28 (ఆంధ్రజ్యోతి) : జిల్లా అదనపు కలెక్టర్ వీరబ్రహ్మాచారి శుక్రవారం డోర్నకల్ తహసీల్దార్ కార్యాలయాన్ని అకస్మికంగా తనిఖీ చేశారు. కార్యాలయంలోని పలు రికార్డులను పరిశీలించారు. సిబ్బంది హాజరుపట్టికను తనిఖీ చేసి అనంతరం తహసీల్దార్ కృష్ణవేణి, సిబ్బందికి పలు సూచనలు చేశారు.

యువకుడి ఆత్మహత్య


సంగీత్ (ఫైల్)

రేగొండ, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): తల్లిదండ్రులు మందలించినందుకు ఓ యువకుడు ఆత్మహత్య చేసుకున్న సంఘటన భూపాలపల్లి జిల్లా రేగొండ మండలంలోని తిరుమలగిరిలో చోటుచేసుకుంది. పోలీసులు, కుటుంబసభ్యులు తెలిపిన ప్రకారం.. పొలెవేన సంగీత్ ఆంధ్రప్రదేశ్‌లోని ఒంగోలులో ఒక నిర్మాణ రంగానికి సంబంధించిన కంపెనీలో ఉద్యోగం చేస్తున్నాడు. గత ఐదు నెలల నుంచి ఉద్యోగానికి వెళ్లకుండా ఇంటివద్దనే ఉంటున్నాడు. కాగా, బుధవారం నేను ఉద్యోగం చేయను వ్యాపారం చేసుకుంటాని తల్లిదండ్రులతో గొడవ పడ్డాడు. ఆర్థికపరిస్థితి బాగాలేదని తల్లిదండ్రులు చెప్పారు. దీంతో మనస్థాపం చెందిన యువకుడు గురువారం ఉదయం ఇంట్లో ఫ్యాన్‌కు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై సందీప్‌కుమార్ తెలిపారు. మృతుడికి తల్లి రజిత, తండ్రి విజేందర్, ఒక సోదరుడు ఉన్నారు.

2న 'చలో ఢిల్లీ'ని జయప్రదం చేయాలి

గోవిందరావుపేట, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): బీసీ రిజర్వేషన్ అమలు కోసం ఏప్రిల్ 2వ తేదీన నిర్వహించే చలో ఢిల్లీ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని బీసీ సంక్షేమ సంఘం ఉమ్మడి వరంగల్ జిల్లా ప్రధాన కార్యదర్శి జంపాల చంద్రశేఖర్ శుక్రవారం ఒక ప్రకటనలో పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమానికి బీసీలు పెద్దసంఖ్యలో తరలి రావాలని ఆయన కోరారు.

కేసముద్రంలో 'మినీ ఆర్యూబీ' కష్టాలు

- మూడో లైను నిర్మాణంతో బంద్
- ఆరు నెలలుగా ఇబ్బందులు పడుతున్న ప్రజలు
- త్వరితగతిన పునఃప్రారంభించాలని విజ్ఞప్తులు


మూడో లైను నిర్మాణం కారణంగా కేసముద్రంలో బంద్ చేసిన మినీ ఆర్యూబీ


అమరవీరుల స్తూపం వద్ద ట్రాక్‌కు మరోవైపు నుంచి వెళ్లిన వారు నిలిపిన ద్విచక్ర వాహనాలు

కేసముద్రం, మార్చి 28 (ఆంధ్రజ్యోతి) : కేసముద్రం మండల కేంద్రంలో మినీ ఆర్యూబీని మూడో లైను నిర్మాణం కారణంగా బంద్ చేయడంతో ఆరు నెలలుగా ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. 15వేల జనాభా ఉన్న కేసముద్రం స్టేషన్‌ను రైల్వే ట్రాక్ రెండుగా విభజించినట్టుగా ఉంటుంది. రైల్వే ట్రాక్‌కు ఒకవైపు ఉన్న గ్రామాల ప్రజలు మరోవైపు దాటేందుకు కేసముద్రంలో ఉన్న రైల్వే గేటును 2012లో రైల్వేశాఖ తొలగించింది. అదే సమయంలో సమీపంలో రైల్వే ఓవర్ బ్రిడి (ఆర్‌వోబీ)ని ప్రారంభించారు. ఆర్‌వోబీ గ్రామానికి దూరంగా ఉండడంతో ప్రజల సౌకర్యం కోసం ఈ గేటు పక్కనే వరద నీరు వెళ్లేందుకు నిర్మించిన రైల్వే 'కల్వర్టు'ను అప్పటి పాలకుల విజ్ఞప్తి మేరకు రైల్వే అధికారులు 'మినీ ఆర్యూబీ'గా మార్చారు. దీంతో పాదాచారులు, ద్విచక్ర వాహనదారులు నిత్యం వందల సంఖ్యలో ఈమినీ ఆర్యూబీలో నుంచి రాకపోకలు సాగించేవారు. కేసముద్రం స్టేషన్, అమినాపురం, కేసముద్రం విలేజి, ఉప్పరపల్లి, అర్పనపల్లి, కాట్రపల్లి, ధన్నసరి, బేరువాడ, పెనుగొండ, పరిసర తండాలకు చెందిన ప్రజలు నిత్యం రైల్వే ట్రాక్‌ను ఈ మినీ ఆర్యూబీలో నుంచి మరోవైపునకు దాటుతుంటారు.


మినీ ఆర్యూబీలో నుంచి వెళుతున్న ప్రజలు (ఫైల్)

ఆరు నెలలుగా ప్రజల ఇబ్బందులు

కేసముద్రం మండల కేంద్రంలో రైల్వేట్రాక్‌కు మూడో లైను నిర్మాణం కోసం గత ఏడాది సెప్టెంబరు 26న మినీ ఆర్యూబీని బంద్ చేయడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మినీ ఆర్యూబీని బంద్ చేయడంతో దూరంగా ఉన్న ఆర్‌వోబీపై నుంచి చుట్టూ తిరిగి మరోవైపున ఉన్న ప్రాంతాలకు వెళ్లాల్సివస్తోంది. ద్విచక్ర వాహనదారులు అంబేద్కర్ సెంటర్ వైపు నుంచి ట్రాక్‌కు అవతలి వైపున 50 మీటర్ల దూరంలో ఉన్న అమరవీరుల స్తూపం ప్రాంతానికి వెళ్లాలంటే రెండు కిలోమీటర్లు ప్రయాణించాల్సిన పరిస్థితి ఉంది. దీంతో తమ వాహనాలను ట్రాక్‌కు సమీపంలో నిలిపి మరోవైపునకు నడుచుకుంటూవెళుతున్నారు. చుట్టూ తిరిగి వెళ్లాల్సి ఉండడంతో తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. మహబూబాబాద్ జిల్లా కేంద్రంలో మూడో లైను నిర్మాణం పూర్తిచేసి ఆర్‌యూబీని ఇటీవలె పునఃప్రారంభించారు. కేసముద్రంలో ఎగువన ఉన్న అమినాపురం చెరువు ప్రాంతం నుంచి నీటిప్రవాహం వస్తుండడంతో ఆర్‌యూబీ పనులకు ఆటంకం ఏర్పడుతున్నట్లు రైల్వే వర్గాలు చెబుతున్నాయి. ఇప్పటికైనా సంబంధిత అధికారులు సమన్వయం చేసుకొని ఈ కల్వర్టు నిర్మాణాన్ని రాకపోకలకు అనుకూలంగా త్వరితగతిన పూర్తిచేసి పునఃప్రారంభించాలని పలువురు కోరుతున్నారు.

ఇబ్బందులు పడుతున్నాం..
సుందర్ వెంకన్న, కేసముద్రం స్టేషన్



మినీ ఆర్యూబీ బంద్ చేయడంతో నిత్యం ఇంటి నుంచి నా టైర్ల షాపునకు వచ్చేందుకు రెండు కిలోమీటర్లు తిరిగి రావాల్సి వస్తోంది. చాలా మంది తమ ద్విచక్ర వాహనాలను ఒకవైపు నిలిపి మరోవైపు నడుచుకుంటూ వెళ్లి వస్తున్నారు. అధికారులు చొరవచూపి తొందరగా పనులు పూర్తిచేసి మినీ ఆర్యూబీని ప్రారంభించి ప్రజల ఇబ్బందులు తొలగించాలి.

బస్టాండ్‌లో గంజాయి పట్టివేత


తొర్రూరు బస్టాండ్‌లో గంజాయిని స్వాధీనం చేసుకుంటున్న పోలీసులు

తొర్రూరు, మార్చి 28 (ఆంధ్రజ్యోతి) : గంజాయి తరలిస్తున్న ఇద్దరు వ్యక్తులను అదుపులోకి తీసుకుని, సరుకును స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై ఉపేందర్ తెలిపారు. శుక్రవారం పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్‌లో మహా రాష్ట్రకు చెందిన ఇద్దరు వ్యక్తులు రెండు బ్యాగులలో శుద్ధి చేసిన గంజాయిని ఒడిశా నుంచి మహారాష్ట్రకు బస్సులో తరలిస్తుండగా అదుపులోకి తీసుకున్నా మని తెలిపారు. వారి వద్ద సుమారు రూ.2లక్షల 50వేల విలువల గల 9కేజీల గంజాయిని స్వాధీనం చేసుకున్నామన్నారు. శుద్ధి చేసిన గంజాయిని మహారాష్ట్రలోని ముంబైలో విక్రయించేందుకు అక్రమ రవాణా చేస్తున్న పితాంబరి, నరేష్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై ఉపేందర్ తెలిపారు.

ఇంటి పన్నుల కోసం జబర్దస్తీ

- సవరించే వరకు ట్యాక్సులు చెల్లించం
- మరిపెడ మున్సిపల్ సిబ్బంది, రైస్‌మిల్లు ఓనర్ల మధ్య వాగ్వాదం


ఇంటి పన్నుల వసూలు కోసం జబర్దస్తీ చేస్తున్న మునిసిపల్ సిబ్బంది

మరిపెడ, మార్చి 28 (ఆంధ్రజ్యోతి) : ఇంటి పన్నులు చెల్లించాలని బకాయి పడిన ఇళ్లు, రైస్ మిల్లుల వద్దకు చేరుకొని మున్సిపల్ సిబ్బంది శుక్రవారం జబర్దస్తీ చేశారు. పన్నులు సవరించే వరకు చెల్లించమని ఇంటి యజమానులు, రైస్ మిల్లుల ఓనర్లు తెగేసి చెప్పడంతో మునిసిపల్ సిబ్బందికి పన్ను చెల్లింపుదారుల మధ్య వాగ్వాదం చోటు చేసుకుంది. దీంతో ఇరువురి మధ్య మాటామాట పెరుగుతుండంతో విషయం తెలుసుకున్న మరిపెడ పోలీసులు అక్కడికి చేరుకొని వారితో మాట్లాడి ఘర్షణ వాతావరణాన్ని శాంతింపచేశారు. రెండు రోజుల్లో ఇంటి పన్నులు చెల్లించాలని సూచించారు. ఈ సందర్భంగా రైస్ మిల్లుల యజమానులు వుప్పుల వెంకటేశ్వర్లు, సత్యం స్థానిక విలేకరులతో మాట్లాడారు. ఇంటి పన్నులు, వ్యాపార, వాణిజ్య పన్నులు శాస్త్రీయంగా లేవని, ఈ విషయం ఇప్పటికే మునిసిపల్ కౌన్సిల్ 50 శాతానికి పన్నులు తగ్గించాలని తీర్మానం చేసినట్లు తెలిపారు. జిల్లా కలెక్టర్‌కు సైతం పట్టణ ప్రజలు ఫిర్యాదు చేశారన్నారు. అయినప్పటికీ మునిసిపల్ అధికారులు పన్నుల వ్యత్యాసాలను తగ్గిస్తలేదని, దీంతో పన్నుల చెల్లింపుపై ప్రజలు ఆసక్తి చూపడం లేదని గుర్తు చేశారు. ఇప్పటికైనా మునిసిపల్ అధికారులు ప్రత్యేక చొరవ చూపి పన్నులు తగ్గించాలని వారు డిమాండ్ చేశారు.


దేవాలయం ఆవరణలో కానుకలను లెక్కిస్తున్న సిబ్బంది

రామప్ప హుండీ ఆదాయం రూ.4.47లక్షలు

వెంకటాపూర్, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పాలంపేట గ్రామంలో గల రామప్ప రామలింగేశ్వరస్వామి దేవాలయంహుండీల ఆదాయం రూ.4,47,784 సమకూరాయి. మహాశివరాత్రి సందర్భంగా భక్తులు సమర్పించిన కానుకలను శుక్రవారం దేవాలయం ఆవరణలో సిబ్బంది లెక్కించారు. ఈ సందర్భంగా రూ.4,07,670 నోట్లు, రూ.40,114 నాణేలు మొత్తం రూ.4,47,784ల ఆదాయం సమకూరినట్లు పరిశీలకులు నందనం కవిత, ఆలయ ఈవో బిల్ల శ్రీనివాస్ తెలిపారు. కార్యక్రమంలో అర్చకులు హరీష్‌శర్మ, ఉమాశంకర్, సిబ్బంది అవినాష్, సంతోష్, రెవెన్యూ, పోలీస్ సిబ్బంది, సేవా సమితి సభ్యులు పాల్గొన్నారు.

విద్యుత్ సరఫరాలో అంతరాయం

- దేవాదుల ఫేజ్-2, 3 ద్వారా పంపింగ్ బంద్
- శుక్రవారం సాయంత్రానికి పునరుద్ధరణ

కన్నాయిగూడెం, మార్చి 28 (ఆంధ్రజ్యోతి) : ములుగు జిల్లా కన్నాయిగూడెం మండలంలోని గుట్టల గంగారం వద్ద ఉన్న జే చొక్కారావు దేవాదుల ఎత్తిపోతల ప్రాజెక్టులో విద్యుత్ సరఫరాలో అంతరాయంతో పంపింగ్‌ను గురువారం అర్ధరాత్రి నిలిపివేశారు. ట్రాన్స్‌కో సబ్‌స్టేషన్‌లోని రెండో ఫీడర్‌లో విద్యుత్ సరఫరాలో హైవోల్టేజీ, లోవోల్టేజీ కారణంగా ఫేజ్-2లో రెండు మోటార్లు, ఫేజ్-3లో రెండు మోటార్లను ఆఫ్ చేసిన అధికారులు శుక్రవారం మధ్యాహ్నం వరకు ఫేజ్-3లోని మరో రెండు మోటార్ల ద్వారా 583 క్యూసెక్కుల నీటిని పంపింగ్ చేశారు. ట్రాన్స్‌కో సబ్‌స్టేషన్‌లో మరమ్మతులు నిర్వహించి సరిచేసిన అనంతరం శుక్రవారం సాయంత్రం ఫేజ్-2లో రెండు, ఫేజ్-3లో మరో రెండు మోటార్లను ఆన్ చేసి మొత్తం 6 మోటార్ల ద్వారా 1661 క్యూసెక్కుల నీటిని భీంఘనపూర్ రిజర్వాయర్‌కు ఎత్తిపోస్తున్నారు. ఇదిలా ఉండగా తుపాకులగూడెం వద్ద ఉన్న సమ్మక్క సాగర్ బ్యారేజీలోకి ఇన్‌ఫ్లో కొనసాగుతుంది. ఎగువ నుంచి 1380 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తుండడంతో బ్యారేజిలోని మొత్తం 59 గేట్లు మూసి వచ్చిన నీటిని వచ్చినట్లు నిల్వ చేస్తున్నారు. ఎగువ నుంచి వచ్చే ఇన్‌ఫ్లో కంటే పంపింగ్ చేసే నీళ్లు ఎక్కువ క్యూసెక్కుల నీళ్లు ఉండడంతో బ్యారేజిలోని నీటి నిల్వలు రోజు రోజుకు తగ్గి పోతున్నాయి. ఈ పంపింగ్ ఇలాగే కొన్ని రోజులు కొనసాగితే బ్యారేజీ డెడ్ స్టోరేజ్‌కి చేరే ప్రమాదం ఉంది. బ్యారేజీ పూర్తి స్థాయి నీటిమట్టం 6.94 టీఎంసీలు కాగా, ప్రస్తుతం కేవలం 1.55 టీఎంసీల నీళ్లు నిల్వ ఉన్నాయి. బ్యారేజీ వద్ద 75.45 మీటర్ల నీటిమట్టం నమోదు కాగా, దేవాదుల ఇన్‌టేక్‌వెల్ వద్ద 75.35 మీటర్ల నీటిమట్టం నమోదైంది.


ఆఫ్ చేసిన దేవాదుల మోటార్లు

పరీక్ష కేంద్రాలను తనిఖీ చేసిన డీఈవో

మొగుళ్లపల్లి, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మొగుళ్లపల్లి, మొట్లపల్లి ఉన్నత పాఠశాలల్లో పదో తరగతి పరీక్ష కేంద్రాలను శుక్రవారం జిల్లా విద్యాశాఖ అధికారి ముద్దమల్ల రాజేందర్ తనిఖీ చేశారు. ఉదయం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో సెట్ కాన్ఫరెన్స్‌లో పాల్గొని జిల్లాలోని అన్ని పరీక్ష కేంద్రాల సీఎస్‌లు, డీవోలు, కస్టోడియన్ అధికారులతో పరీక్షల నిర్వహణపై పలు సూచనలు చేశారు. పోలీస్ స్టేషన్‌లో భద్రపరిచిన ప్రశ్నపత్రాల ఏర్పాట్లను పరిశీలించారు. అనంతరం మొట్లపల్లి, మొగుళ్లపల్లి పరీక్ష కేంద్రాల్లో జరుగుతున్న పరీక్షల నిర్వహణను పరిశీలించారు. విద్యార్థులకు కల్పించిన సౌకర్యాలను పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. అనంతరం మండలంలోని ములుకలపల్లి ప్రాథమికోన్నత పాఠశాలను సందర్శించి విద్యార్థులు అభ్యసన సామర్థ్యాలను పరీక్షించారు. ఆయన వెంట జిల్లా ప్లానింగ్ కోఆర్డినేటర్ దువ్వటి రాజగోపాల్, ఉపాధ్యాయులు ఉన్నారు.

పదో తరగతి పరీక్షా కేంద్రంలోకి మొబైల్ ఫోన్లు

- నిబంధనలు ఉల్లంఘించిన చీఫ్ సూపరింటెండెంట్?
- బందోబస్తు నిర్వహిస్తున్న సీఐతో వాగ్వాదం!

ములుగు, మార్చి 28 (ఆంధ్రజ్యోతి) : ములుగు జిల్లా కలెక్టర్ కార్యాలయానికి కూతవేటు దూరంలో.. డీఈవో కార్యాలయ ప్రాంగణంలోనే ఉన్న ప్రభుత్వ ఉన్నత పాఠశాలలోని పరీక్షా కేంద్రానికి అదే పాఠశాల ప్రధానోపాధ్యాయుడు చీఫ్ సూపరింటెండెంట్‌గా వ్యవహరిస్తున్నారు. విద్యార్థులెవ్వరూ ఎలక్ట్రానిక్ వస్తువులు కేంద్రం లోపలికి తీసుకెళ్లకుండా కట్టడి చేసేందుకు గేటు వద్దే క్షుణ్ణంగా తనిఖీ చేయాలని, పరీక్ష విధుల్లో ఉన్న ఉపాధ్యాయులు తమ మొబైల్ ఫోన్‌లను బందోబస్తు విధుల్లో ఉన్న పోలీసులకు అప్పగించాలని జిల్లా కలెక్టర్ ముందే ఆదేశాల జారీ చేశారు. అయితే ఈ ఎగ్జామ్ సెంటర్ సీఎస్ మాత్రం ఈ సూచనను పాటించడం లేదని తెలుస్తోంది. తనతో పాటు ఇన్విజిలేటర్ల ఫోన్‌లను లోపలికి తీసుకువెళ్లి బీరవాలో పెడుతున్నట్లు సమాచారం. నిబంధన ప్రకారం ఫోన్‌లను తమకు అప్పగించాలని బందోబస్తు డ్యూటీలో ఉన్న పోలీసులు ఎన్నిసార్లు చెప్పినా సదరు సీఎస్ పట్టించుకోకపోగా వారితో వాగ్వాదానికి దిగుతున్నాడని తెలిసింది. పోలీసులు గేటు వద్దే ఉండాలని, ప్రాంగణంలోకి రావొద్దని సదరు ఎగ్జామ్ సెంటర్ సీఎస్ గురువారం ఓ ప్రొబేషనరీ ఎస్సైతో గొడవ పడ్డాడు. విషయం తెలుసుకున్న ములుగు సీఐ శంకర్ శుక్రవారం ఉదయం ఇదే పరీక్షా కేంద్రం వద్ద బందోబస్తును సమీక్షిస్తూనే ప్రాంగణంలోకి వెళ్లాడు. 'ఆవరణలోకి రావొద్దన్నా ఎందుకు వస్తున్నారు..' కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తాను..' అంటూ ఆయన సీఐని దబాయించినట్లు తెలిసింది. నిబంధనలకు విరుద్ధంగా మొబైల్ ఫోన్‌లను పరీక్షా కేంద్రం లోపలికి తీసుకువెళ్లడమే కాకుండా బందోబస్తులో ఉన్న పోలీసుల పట్ల అమర్యాదగా మాట్లాడుతారా..? అంటూ సీఐ శంకర్ ఆ చీఫ్ సూపరింటెండెంట్‌పై ఆగ్రహం వ్యక్తం చేసినట్లు సమాచారం. వెంటనే జరిగిన ఈ మొత్తం సంఘటనను సీఐ తమ ఉన్నతాధికారులకు నివేదించారు. కాగా, ఈ విషయమై పోలీసు నిఘా వర్గాలు ఆరా తీయడం మొదలుపెట్టాయి. కఠినమైన నిబంధనను బ్రేక్ చేస్తూ మొబైల్ ఫోన్‌లను లోపలికి తీసుకువెళ్లిన సీఎస్ వాటిని బీరువాలో భద్రపర్చడానికే పరిమిత మయ్యారా..? లేక ఏదైనా పొరపాటు చేశారా..? అనే కోణంలో అంతర్గత విచారణ జరుపుతున్నారు. ఇదిలా ఉంటే డీఈవో కార్యాలయం ఇదే ప్రాంగంలో ఉండగా ఆ ఉన్నతాధికారికి ఇవేమీ తెలియకపోవడం విడ్డూరం.

గడ్డి మందు తాగిన వ్యక్తి మృతి


రవి (ఫైల్)

మహబూబాబాద్ రూరల్, మార్చి 28 (ఆంధ్రజ్యోతి) : చికిత్స పొందుతూ ఓ యువకుడు మృతి చెందిన ఘటన మహబూబాబాద్ మండలం సీత్లాతండా శివారు ఈర్యతండాలో శుక్రవారం చోటు చేసుకుంది. రూరల్ ఎస్సై దీపిక రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం... ఈర్యతండాకు చెందిన బానోత్ రవి(35) కూలీ పనులు చేసుకుంటూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. ఇటీవల ఇంటి అవసరాల కోసం రూ.50వేలు అప్పు తీసుకురాగా, అవి ఎలా తీర్చాలనే మనోవేదనకు గురై ఈనెల 25న ఇంట్లో ఎవరూలేని సమయంలో గడ్డి మందు తాగాడు. గమనించిన కుటుంబసభ్యులు చికిత్స నిమిత్తం జిల్లా ఆస్పత్రికి తరలించారు. వైద్యుల సూచన మేరకు మెరుగైన వైద్యం కోసం జిల్లా కేంద్రంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ గురువారం రాత్రి రవి మృతి చెందాడు. మృతుడికి భార్య అరుణ, కుమారుడు ఉదయ్‌కుమార్ ఉన్నారు. భార్య అరుణ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

తీవ్ర దుఃఖంతో ఎస్సెస్సీ పరీక్ష రాసిన విద్యార్థి

మహబూబాబాద్ మండలం సీత్లాతండా శివారు ఈర్యతండాకు చెందిన పదో తరగతి విద్యార్థి బానోత్ ఉదయ్‌కుమార్ జిల్లా కేంద్రంలోని ఓ ప్రైవేట్ పాఠశాలలో పదో తరగతి చదువుతున్నాడు. ఇటీవల పదో తరగతి వార్షిక పరీక్షలు ప్రారంభమైన సంగతి తెలిసిందే. ఇదిలా ఉండగా విద్యార్థి ఉదయ్‌కుమార్ తండ్రి బానోత్ రవి గడ్డి మందు తాగి మృతి చెందాడు. ఓ వైపు తండ్రి మృతదేహం ఇంటి వద్ద ఉండగా మరోవైపు కుమారుడు ఉదయ్ తీవ్ర దుఃఖంలో సైతం పరీక్ష కేంద్రానికి వెళ్లి ఫిజికల్ సైన్స్ (పేపర్-1)ను రాశాడు. అనంతరం తండ్రి అంత్యక్రియలను నిర్వహించాడు.

మత సామరస్యానికి ప్రతీక రంజాన్ పండుగ

- బీఆర్ఎస్ ములుగు జిల్లా అధ్యక్షుడు లక్ష్మణ్‌బాబు


ఏటూరునాగారం మజీద్‌లో ఇఫ్తార్ విందులో పాల్గొన్న బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు లక్ష్మణ్‌బాబు

ఏటూరునాగారం, మార్చి 28 (ఆంధ్రజ్యోతి) : మత సామరస్యానికి ప్రతీక రంజాన్ పండుగ అని బీఆర్ఎస్ పార్టీ ములుగు జిల్లా అధ్యక్షుడు కాకులమర్రి లక్ష్మనర్సింహరావు (లక్ష్మణ్‌బాబు) అన్నారు. శుక్రవారం సాయంత్రం మండల కేంద్రంలోని మసీద్‌లో ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందుకు లక్ష్మణ్‌బాబు ఎస్సై తాజుద్దీన్‌తో కలిసి పాల్గొన్నారు. ఈసందర్భంగా లక్ష్మణ్‌బాబు మాట్లాడుతూ.. రంజాన్ ఒక పవిత్రమైన పండగ అని, మానవ సేవ చేయాలన్ని సందేశాన్ని మానవాళికి అందించే పండుగ అని తెలిపారు. రంజాన్ మాసంలో ఆచరించే ప్రార్థనలు, ఉపవాసలు, క్రమశిక్షణను ఆధ్యాత్మికతను పెంపొందిస్తుందన్నారు. ఈద్-ఉల్-ఫితర్ సందర్భంగా ముస్లింలు తమ పవిత్ర ప్రార్థనలతో అల్లా దీవెనలు పొందాలని అల్లాను కోరారు. కార్యక్రమంలో ములుగు గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ పోరిక గోవింద నాయక్, జిల్లా నాయకులు కాకులమర్రి ప్రదీప్ రావు, తాడూరి రఘు, ఏటూరునాగారం మసీద్ కమిటీ అధ్యక్షుడు ఎమ్డీ.వలీబాబా, ఉపాధ్యక్షుడు ఎమ్డీ.అజ్మత్‌ఖాన్, ఎస్‌కె.రఫీక్ పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లో 'ఏఐ' పాఠాలు

- అధునాతన పద్ధతిలో బోధన
- ములుగు జిల్లాలో ఐదు పాఠశాలల ఎంపిక
- నాలుగు చోట్ల మొదలైన పాఠాలు

ములుగు కలెక్టరేట్, మార్చి 28 (ఆంధ్రజ్యోతి) : ప్రపంచం 'ఏఐ' వెంట పరుగులు పెడుతోంది. ఆర్టిఫీషియల్ ఇంటలీజెన్స్‌గా పిలవబడుతున్న ఈ కృత్రిమ మేధ చొరబడని రంగమే లేదిప్పుడు. ఈ సాంకేతికతను విద్యారంగంలో ప్రవేశపెట్టి ప్రాథమిక విద్యనభ్యసిస్తున్న విద్యార్థుల సామర్థ్యాలను పెంచేందుకోసం రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఏఐ బోధన ములుగు జిల్లాలో ప్రారంభమైంది. తెలుత రాష్ట్రంలోని ఆరు జిల్లాల్లో పైలెట్ ప్రాజెక్టుగా మొదలుపెట్టిన ఈ కార్యక్రమం సత్ఫలితాలు ఇవ్వడంతో మిగతా జిల్లాల్లో అమలులోకి తెచ్చారు.

మొదటి దశలో ఐదు పాఠశాలల్లో..

జిల్లాలో తొలిదశలో ఐదు పాఠశాలల్లో ఏఐ పాఠాల బోధనకు ప్రభుత్వం ఆదేశించింది. ములుగు మండలంలోని పత్తిపల్లి, గోవిందరావుపేటలోని చల్వాయి, తాడ్వాయి మండలం బీరెల్లి, ఏటూరునాగారం మండలం రామన్నగూడెం ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలను ఇప్పటివరకు ఎంపిక చేశారు. ఈనెల 17న చల్వాయిలో జిల్లా కలెకర్ టీఎస్.దివాకర పాఠాలను ప్రారంభించారు. శుక్రవారం పత్తిపల్లిలో డీఈవో పాణిని, బీరెల్లి, రామన్నగూడెంలో సమగ్రశిక్ష క్వాలిటీ కోఆర్డినేటర్ కాటం మల్లారెడ్డి ప్రారంభించారు. ఒక్కో పాఠశాలలో ఐదు కంప్యూటర్‌లతో ల్యాబ్‌ను ఏర్పాటు చేశారు.



వర్చువల్, రియాలిటీ విధానంలో బోధన జరగనుంది. ఇందుకోసం రిసోర్స్ పర్సన్‌లను నియమించారు. వారికి హైదరాబాద్‌లో శిక్షణ ఇచ్చారు. ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులకు కూడా ప్రత్యేక శిక్షణ ఇవ్వడం జరిగింది.

3 నుంచి 5వ తరగతి వరకు బోధన

ప్రాథమిక విద్యను అభ్యసిస్తున్న 3, 4, 5 తరగతుల విద్యార్థులకు గణితం, తెలుగు సబ్జెక్టులలో సామర్థ్యాలను పెంచేందుకోసం ఏఐ ద్వారా బోధన చేయనున్నారు. చదువులో వెనుకబడిన విద్యార్థులను ఎంపికచేసి కూడికలు, తీసివేతలు, గుణకారాలు, భాగహారాలతో మొదలుపెట్టి గణితం మంటే భయం పోయేలా కంప్యూటర్‌లో బొమ్మలు, ఆటపాటల ద్వారా బోధిస్తారు. తెలుగు పద్యాలు, పాటలను సరళమైన పద్ధతిలో నేర్పించనున్నారు.

వరంగల్ మార్కెట్ ధరలు

(రూ. వేలల్లో)

పంట	క్వింటా గరిష్ఠం	క్వింటా కనిష్ఠం
మక్కలు (బిల్టీ రకం)	2181	1521
పల్లికాయ (సూక)	7300	5200
పల్లికాయ (పచ్చిది)	5650	4575
కందులు	6551	3022
పెసళ్లు	7308	3022
పత్తి	7050	5300
పసుపు (కాడి)	9329	8534
పసుపు (గోల)	7407	6700
తేజ మిర్చి	12650	9500
డిడి	-	-
వండర్‌హాట్	14200	12000
ఎల్లో మిర్చి	-	-
యూఎస్341	11600	9000
దేశీ	29000	18000
సింగిల్‌పట్టి	28000	20000
దీపిక	13000	10000
తాలు మిర్చి	5000	2500

- వరంగల్ వ్యవసాయం

విలీనం మంచికే..

- సెర్ప్ - మెప్మా కలయికతో సత్వర సేవలకు అవకాశం
- గ్రామీణ, పట్టణ సభ్యులకు సమ ప్రయోజనం
- పాలనాపరంగా తొలగనున్న ఇబ్బందులు
- తీరనున్న సిబ్బంది కొరత..

స్వాగతిస్తున్న మెప్మా ఉద్యోగులు

హనుమకొండ, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థ (సెర్ప్)లో పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ (మెప్మా)ను విలీనం చేయడంవల్ల నిర్వహణ పరంగా, ప్రభుత్వ పథకాల అందుబాటు విషయంలో మహిళాసంఘాల్లోని సభ్యులకు మరింత మేలు జరుగుతుందన్న అభిప్రాయం వ్యక్తం అవుతున్నది. ఇన్నాళ్లూ ఈ రెండు సంస్థలు వేరు వేరుగా పని చేయడం వల్ల ఎదురైన ఇబ్బందులు తొలగిపోతాయని అధికారులు చెబుతున్నారు. విలీనం వల్ల ప్రభుత్వం అందించే ప్రయోజనాలు అందరికీ సమానంగా అందుతాయంటున్నారు. విలీనంతో వరంగల్ మహానగర పాలక సంస్థతో సహా తొమ్మిది మున్సిపాలిటీల పరిధిలోని 8,623 సంఘాల్లోని 98వేల మంది మెప్మా సభ్యులు సెర్ప్ పరిధిలోకి వస్తారు. ఉద్యోగుల హోదాలు మారుతాయి. వేతనాలూ పెరుగుతాయి.

విలీనం వల్ల ప్రయోజనాలు

వరంగల్ మహానగర పాలక సంస్థతో పాటు ఉమ్మడి జిల్లాలోని తొమ్మిది మున్సిపాలిటీల్లోకి చుట్టు పక్కల గ్రామాలను విలీనం చేయడంవల్ల ఆ గ్రామాల ప్రజలు కొన్నేళ్లుగా ఉపాధి హామీ పథకానికి దూరమవుతున్నారు. సెర్ప్‌లో మెప్మా విలీనమవటం వల్ల గ్రామీణ, పట్టణ ప్రాంతమనే తేడా లేకుండా పని కోరుకు నేవారందరికీ ఉపాధి లభిస్తుంది. రెండు సంస్థలు విడిగా పని చేస్తే సాంకేతిక విని యోగంలో అడ్డంకులు ఎదురవుతాయి. విలీనం ద్వారా ఒకే డిజిట ల్ వేదికను సృష్టించి లబ్ధిదారుల గుర్తింపు, పథకాల అమలు పర్యవేక్షణ సులువు తుంది. ప్రధానంగా సిబ్బంది కార్యాల యాల కొరత తీరుతుంది. ఉదాహరణకు ఆరు జిల్లాలు వరంగల్, హనుమకొండ, జనగామ, మహబూబాబాద్, ములుగు, జయశంకర్ భూపాలపల్లిలలో సెర్ప్‌లో సుమారు 1200 మంది సిబ్బంది విధుల్లో ఉంటే మెప్మాపరిధిలో 180 మంది మాత్రమే పనిచేస్తున్నారు. సెర్ప్, మెప్మా ఏకీకృతం వల్ల సిబ్బంది కొరత తీరటమే కాకుండా పనితీరు మెరుగు పడుతుంది.

మున్సిపాలిటీల్లోకి గ్రామాల విలీనంతో..

పట్టణీకరణ శరవేగంగా జరుగుతోంది. కొత్తగా పలు మున్సిపాలిటీలు ఏర్పడుతున్నాయి. అనేక గ్రామాలు వీటిలో విలీనమై పట్టణ స్వభావాన్ని సంతరించుకుంటున్నాయి. కొన్ని మేజర్ పంచాయతీలు పురపాలక సంఘాలుగా మారుతున్నాయి. అప్పటివరకు సెర్ప్‌లో ఉన్న ఈ గ్రామాలు మెప్మా పరిధిలోకి వచ్చేసరికి అవి పొందే ప్రయోజనాల్లో వ్యత్యాసాలు కలుగుతున్నాయి. సెర్ప్ ద్వారా అందుతున్న ప్రభుత్వ పథకాలు మెప్మాలో పొందే పరిస్థితి ఉండడం లేదు. ఉపాధి హామీ పనుల వర్తింపే ఇందుకు ప్రత్యక్ష ఉదాహరణ. దీంతో సహజంగానే మెప్మా పరిధిలోకి వచ్చిన సెర్ప్ సభ్యుల్లో అసంతృప్తి వ్యక్తం అవుతోంది. పైగా సెర్ప్ ద్వారా చాలా పథకాలు అమలవుతున్నాయి. ఈ నేపథ్యంలో సెర్ప్‌లో మెప్మాను విలీనం చేయాలనే నిర్ణయానికి ప్రభుత్వం వచ్చింది. ఇందిరా మహిళా శక్తి మిషన్ కింద పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లోని మహిళా స్వయం సహాయక సంఘాలను ఒకే గొడుగు కిందికి తీసుకువచ్చేలా ఉత్తర్వులు జారీ చేసింది. ఇన్నాళ్లు వేర్వేరుగా ఉన్న గ్రామీణ, పట్టణ స్వయం సహాయక సంఘాలన్నీ సెర్ప్ పరిధిలోకి రానున్నాయి. స్వయం సహాయక సంఘాల నిర్వహణ, మహిళా శక్తి పథకం అమలు, ఉద్యోగులు, సిబ్బందికి విధులు, బాధ్యతల కేటాయింపు తదితర అంశాలపై స్పష్టమైన మార్గదర్శకాలు ప్రభుత్వం ప్రకటించాల్సి ఉన్నది. దీనిపై కసరత్తు జరుగుతోంది. ఏప్రిల్ మొదటి వారంలో ఉత్తర్వులు రానున్నట్టు సమాచారం. ప్రభుత్వ విలీన నిర్ణయంపై మెప్మా ఉద్యోగులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

పెరగనున్న సమన్వయం

సెర్ప్, మెప్మా ఈ రెండు సంస్థల లక్ష్యం పేదరిక నిర్మూలనే అయినప్పటికీ గ్రామీణ ప్రాంతాలపై సెర్ప్ దృష్టి సారిస్తుంది. పట్టణ ప్రాంతాల్లో పేదరికాన్ని తగ్గించేందుకు మెప్మా పని చేస్తుంది. వీటిని ఒకే సంస్థగా మార్చటం వల్ల వనరుల సమన్వయం పెరుగుతుంది. తద్వారా ప్రభుత్వ విధానాల అమలులో ఏకరూపత వస్తుంది. పట్టణ, గ్రామీణ ప్రాంతాలు సమతుల్య అభివృద్ధిని సాధించేందుకు అవకాశాలు ఏర్పడుతాయి. ఉదాహరణకు ఇటీవల రాష్ట్రప్రభుత్వం మహిళా స్వయం సహాయక సంఘాలకు సెర్ప్ ద్వారా బస్సులు కొనుగోలు చేసి ఆర్టీసీకి అద్దెకు ఇచ్చే కార్యక్రమాన్ని చేపట్టింది. అయితే ఇది మెప్మాకు వర్తించకపోవటంతో పట్టణ మహిళా స్వయం సహాయక సంఘాల సభ్యులు నిరాశకు గురయ్యారు. ప్రభుత్వ తాజా నిర్ణయం ఇలాంటి సమస్యలకు చెక్ పెట్టనున్నది.

సెర్ప్‌లోకి మెప్మా ఉద్యోగులు

ప్రభుత్వ తాజా నిర్ణయంతో ఉమ్మడి వరంగల్ జిల్లాలో పని చేస్తున్న ఉద్యోగులు, సిబ్బంది, రిసోర్సు పర్సన్లు సెర్ప్ పరిధిలోకి రానున్నారు. డీఆర్‌డీవో ఆధ్వర్యంలో వీరు విధులు నిర్వహించనుండగా హోదాలు మారనున్నాయి. మెప్మా పరిధిలో 180 మంది రిసోర్సుపర్సన్లు పని చేస్తుండగా వీరు సెర్ప్ పరిధిలో వీవోలుగా మరనున్నారు. 18 మంది సీవోలు సీసీలుగా, ఇద్దరు టీఎంసీలు ఎంపీఎంలుగా, ఏడీఎంసీ ఒకరు ఏపీఎంగా, డీఎంసీగా వ్యవహరించే అధికారికి డీపీఎం హోదా దక్కనున్నది. వీరితో పాటు యూఎల్ఈ, కంప్యూటర్ ఆపరేటర్లు, అటెండర్లు సెర్ప్ పరిధిలోనూ అదే పోస్టుల్లో విధులు నిర్వహించే అవకాశం ఉంది. సెర్ప్ పరిధిలో విలీనం అయితే మెప్మా ఉద్యోగుల వేతనాలు పెరగడంతో పాటు బదిలీలు కూడా జరిగే అవకాశం ఉంది. పట్టణాల్లోని మెప్మా రిసోర్సు పర్సన్లకు రూ.6వేలు వేతనం చెల్లిస్తుంటే, సెర్ప్ ఆర్పీలకు నెలకు రూ.5వేల చొప్పు చెల్లిస్తున్నారు. ఈ రెండు సంస్థలను కలిపితే జీతాలు పెరుగుతాయా? తగ్గుతాయా? అన్నది స్పష్టం కావలసి ఉన్నది.

సంఘాలు - సభ్యులు

ఉమ్మడి వరంగల్ జిల్లాలో సెర్ప్ పరిధిలో మొత్తం 3,073 గ్రామైక్య సంఘాలు, 58,239 స్వయం సహాయ సంఘాలు, 71 మండల సమాఖ్యలు, 6 జిల్లా సమాఖ్యలు, 6,82,564 మంది సభ్యులు ఉన్నారు. కాగా మెప్మా కింద వరంగల్ నగర పాలక సంస్థతో పాటు తొమ్మిది పురపాలక సంఘాల పరిధిలో 8,623 స్వయం సహాయక సంఘాలు, 98,256 మంది సభ్యులు ఉన్నారు. వీరంతా ఒకే గొడుకు కిందకు వస్తారు. పరిపాలన సులువవుతుంది. ప్రయోజనాలు అందరికీ సమానంగా అందుతాయి.

విలీనంతో మరిన్ని ప్రయోజనాలు



మేన శ్రీను, హనుమకొండ జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ పీడీ

రాష్ట్రంలో కోటి మంది మహిళలను కోటీశ్వరులను చేయాలన్న లక్ష్యంతో ప్రభుత్వం ఇందిరా మహిళా శక్తి మిషన్-2025ను ప్రారంభించింది. మహిళా అభివృద్ధే లక్ష్యంగా చేపట్టిన ఈ పథకంలో భాగంగా పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లోని మహిళా స్వయం సహాయక సంఘాలను ఒకే గొడుకు కిందకు తీసుకురావాలని ప్రభుత్వం నిర్ణయించింది. సెర్ప్ ఆధ్వర్యంలో ఉపాధి కల్పన కార్యక్రమాలు, మెప్మాద్వారా పట్టణ ప్రాంతాల్లో నైపుణ్య శిక్ష, వీధివ్యాపారులకు మద్దతు వంటి పథకాలు అమలవుతున్నాయి. వీటిని ఒకే గొడుగు కిందికి తీసుకురావడం వల్ల పట్టణ, గ్రామీణ పేదలకు సమగ్రమైన ప్రయోజనాలు అందించేందుకు వీలు కలుగుతుంది. పైగా ఇటీవల కాలంలో చాలా గ్రామాలు మున్సిపాలిటీల్లో విలీనం అవుతున్నాయి. దీనితో అప్పటి వరకు సెర్ప్ కింద ఉన్న ఇవి మెప్మాపరిధిలోకి వస్తున్నాయి. దీనితో కొన్ని ఇబ్బందులు ఎదురవుతున్నాయి. సెర్ప్, మెప్మా విలీనం అయితే ఈ సమస్య ఉండదు.

వేర్వేరుగా నిర్వహణ

స్వయం సహాయక సంఘాల సంస్థాగత నిర్మాణం, బ్యాంక్ లింకేజీ శ్రీనిధి, రుణాల మంజూరు, ఆర్థికంగా వ్యాపార రంగాల్లో అభివృద్ధి సాధించేలా అందించే ప్రోత్సాహం తదితర అంశాలు ఒకేలా ఉన్నా పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో వేర్వేరు విభాగాలుగా నిర్వహణ కొనసాగుతోంది. పట్టణ ప్రాంతాల్లోని సంఘాల నిర్వహణను మున్సిపల్ కార్యాలయం పరిధిలోని మెప్మా పరిశీలిస్తుండగా, గ్రామీణ ప్రాంతాల్లోని స్వయం సహాయక సంఘాల బాధ్యతను సెర్ప్ చూస్తోంది. రెండు విభాగాల లక్ష్యం మహిళ సాధికారత, వారి ఆర్థికాభివృద్ధే. ఇలా వేర్వేరుగా కొనసాగితే మహిళా శక్తి కార్యక్రమం పట్టణాల్లో అంత పటిష్టంగా అమలు కావడం లేదని భావించిన ప్రభుత్వం పట్టణాల్లోని స్వయం సహాయక సంఘాలన్నింటినీ సెర్ప్ పరిధిలోకి తీసుకురావాలని నిర్ణయించింది.

కిశోర బాలికల సంఘాలు

దేశంలోని ఎక్కడా లేనివిధంగా రాష్ట్రంలో 15-18 ఏళ్ల మధ్య వయసున్న బాలికలకు అర్హత కల్పిస్తూ ప్రత్యేకంగా కిశోర బాలికల సంఘాలను ఏర్పాటు చేయాలని కూడా ప్రభుత్వం నిర్ణయించింది. కిశోర బాలికల గ్రూపులోని సభ్యులకు 18 ఏళ్లు నిండిన తర్వాత వారికి స్వయం సహాయక సంఘాల్లో చేరేందుకు వీలు కల్పిస్తారు. సెర్ప్, మెప్మాను ఏకీకృతం చేయడం వల్ల ఈ సంఘాల విలీనం సులభం అవుతుంది. స్వయం సహాయక సంఘాల్లో కొత్త సభ్యులను చేర్పించే ప్రక్రియ కొనసాగుతోంది. దీనితో ఎస్‌హెచ్‌జీల సంఖ్య గణనీయంగా పెరగనున్నది. ఈ సంఘాలన్నిటిని సమన్వయం చేయడానికి విలీనం దోహద పడుతుంది.

ఇందిరమ్మ ఇళ్ల ప్రక్రియను వేగవంతం చేయాలి

- బేస్‌మెంట్ పూర్తయిన ఇళ్లకు తక్షణమే చెల్లింపులు
- జూన్‌లో వరంగల్ సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి పూర్తి
- ఉమ్మడి వరంగల్ జిల్లా సమీక్షలో మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి



సమీక్షలో పాల్గొన్న మంత్రులు, ఎమ్మెల్యేలు

వరంగల్, మార్చి 28 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాన్ని వేగవంతం చేయాలని, బేస్‌మెంట్ వరకు పూర్తయిన ఇళ్లకు తక్షణమే బిల్లులు చెల్లింపులు చేయాలని రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్‌శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. శుక్రవారం హైదరాబాద్‌లోని సచివాలయంలో ఉమ్మడి వరంగల్ జిల్లా మంత్రులు కొండా సురేఖ, సీతక్కలతో పాటు ఎమ్మెల్యేలు, కలెక్టర్లు, ఇతర ఉన్నతాధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పొంగులేటి మాట్లాడుతూ.. పైలెట్ గ్రామాల్లో ఇందిరమ్మ ఇండ్ల గ్రౌండింగ్ వేగవంతం చేయాలన్నారు. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యమిస్తోందని, దీనిని దృష్టిలో పెట్టుకుని కలెక్టర్లు పని చేయాలని సూచించారు. ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు ప్రభుత్వం నాలుగు విడతల్లో చెల్లింపులు చేస్తుందని, మొదటి విడతలో బెస్‌మెంట్ లెవల్ పూర్తయిన ఇళ్లకు రూ.లక్ష చెల్లిస్తుందన్నారు. వివరాలను అధికారులు హౌసింగ్ విభాగానికి పంపిస్తే తక్షణమే బిల్లులు చెల్లిస్తారని తెలిపారు. ఇందిరమ్మ ఇళ్ల సర్వేలో ఇళ్ల స్థలాలు లేని అర్హత కలిగిన లబ్ధిదారులకు ఇప్పటి వరకు కేటాయించని 2బీహెచ్‌కే ఇళ్లను కేటాయించాలని సూచించారు. అలాగే అసంపూర్తిగా ఉన్న ఇళ్ల నిర్మాణానికి కాంట్రాక్టర్లు ముందుకు రాకుంటే లబ్ధిదారులే ఆ ఇళ్లను పూర్తి చేసుకునేందుకు ముందుకు వస్తే బిల్లులను ప్రభుత్వం చెల్లిస్తుందన్నారు. దీనిని దృష్టిలో పెట్టుకుని లబ్ధిదారులను ఎంపిక చేసి, ఇళ్లను కేటాయించాలని మంత్రి కోరారు.

తాగునీటి సమస్య తలెత్తవద్దు

వేసవికాలంలో ఏ ఒక్క గ్రామంలో, పట్టణంలో కూడా తాగునీటి సమస్య తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని మంత్రి పొంగులేటి సూచించారు. కలెక్టర్లు తాగునీటి సమస్యకు అధిక ప్రాధాన్యమివ్వాలన్నారు. జిల్లా అధికారులతో సమన్వయం చేసుకుని, వారంలో మూడు రోజులు అధికారులు గ్రామాల్లో, వార్డుల్లో పర్యటించాలని కోరారు. వచ్చే మూడు నెలలు చాల కీలకమని, ప్రజలకు ఎక్కడ తాగునీటి గురించి ఇబ్బంది పడకుండా.. నీళ్ల రావటం లేదనే విమర్శలు రాకుండా పని చేయాలని అధికారులను ఆదేశించారు. నీటి కొరత ఉన్న ప్రాంతాల్లో ట్యాంకర్ల ద్వారా తాగునీరు సరఫరా చేయటం, చెడిపోయిన బోర్లు, హ్యాండ్‌పంప్‌లకు తక్షణమే మరమ్మతులు చేపట్టాలని కోరారు.

జూన్‌లో సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి..

వరంగల్ సూపర్ స్పెషాలిటీ అస్పత్రి నిర్మాణ పనులు వేగవంతం చేయాలని మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. రెండు నెలల్లో భవన నిర్మాణ పనులు పూర్తి చేసి, మరో నెల రోజుల్లో వైద్య సేవలకు అవసరమైన పరికరాలను అమర్చి జూన్ చివరి నాటికి సూపర్ స్పెషాలిటీ సేవలను అందుబాటులోకి తీసుకరావాలని మంత్రి సూచించారు. ఈ అస్పత్రి అందుబాటులోకి వస్తే ఉత్తర తెలంగాణ ప్రజలకు అత్యాధునిక వైద్య సేవలు అందుతాయని మంత్రి అన్నారు.

మడికొండ డంపింగ్ యార్డు.. భద్రకాళీ చెరువు పూడికతీతపై..

చెత్త సమస్యతో ఇబ్బందులు పడుతున్న మడికొండవాసులకు శాశ్వత పరిష్కారం చూపిస్తామని మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. వారం రోజుల్లో తాత్కాలిక పరిష్కారం చూపించి, ఆ తరువాత శాశ్వత పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని అధికారులను మంత్రి ఆదేశించారు. దీనికి సంబంధించి సీడీఎంఏ డైరెక్టర్ శ్రీదేవి స్వయంగా డంపింగ్ యార్డు వద్దకు వెళ్లి, పరిష్కార మార్గాలను సూచించాలని మంత్రి ఆదేశించారు. వరంగల్, కరీంనగర్ రహదారి ప్రాంతంలో శాశ్వత డంపింగ్ యార్డు కోసం 150 నుంచి 200 ఎకరాల భూమిని సేకరించాలని ఆయా జిల్లాల కలెక్టర్లను మంత్రి ఆదేశించారు. అలాగే వరంగల్ నగరంలోని భద్రకాళి చెరువు పూడికతీత పనులను ఎట్టి పరిస్థితుల్లో వర్షాకాలం ప్రారంభమయ్యేలోపు పూర్తి చేయాలన్నారు. అలాగే వరంగల్ స్మార్ట్ సిటీ పనుల విషయంలో అధికారులు ప్రణాళికాబద్ధంగా వ్యవహరించాలని మంత్రి పొంగులేటి సూచించారు. ఈ సమావేశంలో ప్రభుత్వ సలహాదారుడు వేం నరేందర్‌రెడ్డి, ఎమ్మెల్యేలు కడియం శ్రీహరి, నాయిని రాజేందర్‌రెడ్డి, రేవూరి ప్రకాష్‌రెడ్డి, యశస్వినిరెడ్డి, దొంతి మాధవరెడ్డి, గండ్ర సత్యనారాయణరావు, కేఆర్.నాగరాజు, రామచంద్రనా యక్, మురళీనాయక్, ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్య, మేయర్ గుండు సుధారాణి, మునిసిపల్‌శాఖ ముఖ్య కార్యదర్శి దానకిషోర్, ఆర్‌అండ్‌బీ కార్యదర్శి హరిచందన, వరంగల్, హనుమకొండ, జనగామ, ములుగు, మహబూబాబాద్, జయశంకర్ భూపాలపల్లి కలెక్టర్లు సత్యశారద, ప్రావీణ్య, రిజ్వాన్‌పాషా, దివాకర, అద్వైత్‌కుమార్, రాహుల్‌శర్మ, జీడబ్ల్యూఎంసీ కమిషనర్ అశ్వినితానాజీ వాఖేడ్ తదితరులు పాల్గొన్నారు.

విశ్వావసుకు శుభస్వాగతం

- నగరంలో జోరుగా ఉగాది కవి సమ్మేళనాలు
- ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారాలు అందజేత

హనుమకొండ కల్చరల్, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): విశ్వావసు నామ ఉగాది పర్వాన్ని పురస్కరించుకొని నగరంలో గురు, శుక్రవారాల్లో జరిగిన కవి సమ్మేళనాలు సాహితీ లోకాన్ని ఆనంద డోలికల్లో ఓలలాడించాయి. వరంగల్ దర్శన్ ఆధ్వర్యంలో నక్కలగుట్టలో పెండెం రమేశ్‌బాబు ఆధ్వర్యంలో జరిగిన వేడుకలు నేత్రపర్వంగా జరిగాయి. బ్రహ్మశ్రీ జగన్ మోహన్‌శర్మ పంచాంగ పఠనం నిర్వహించారు. విశ్వావస నామ ఏడాదిలో ప్రజలకు రాశుల వారిగా శుభ, అశుభ ఫలితాలు, ఆదాయ వ్యయాలను చెప్పారు. అనంతరం తిరునగరి నరేందర్ సంయోజకత్వంలో నిర్వహించిన ఉగాది కవి సమ్మేళనాన్ని పొట్లపల్లి శ్రీనివాస రావు ప్రారంభించారు. ఆడెపు చంద్రమౌళి, డాక్టర్ అడ్లూరి వెంకటేశ్వర్లు, చేపూరి శ్రీరామ్, మెరుగు అనురాధ, మన్ననూరి రాజేశ్వర్‌రావులు పద్య కవితలతో వసంతుని స్వాగతించగా వల్స పైడి, గట్టు రాధిక, వాసిరెడ్డి కృష్ణారావు, తిరునగరి పద్మ, పొగాకు సునీతారాణి తదితరులు అద్భుత వచనంతో కవితాగానం చేశా రు. ఈ సందర్భంగా కవులను బంక సరళ దుశ్శాలువాలతో ఆత్మీయంగా సత్కరించారు.

భాషా నిలయంలో..

అంతకుముందు హనుమకొండలోని రాజరాజ నరేంద్రాంధ్ర భాషా నిలయంలో జాతీయ సాహిత్య పరిషత్ నగరశాఖ, భాషా నిలయం సంయుక్త ఆధ్వర్యంలో ఉగాది పర్వాన్ని పురస్క రించుకొని పెద్దఎత్తున నిర్వహించిన కవి సమ్మేళనంలో ద్విభా షలకు చెందిన 62 మంది కవులు పాల్గొని కవితాగానం చేయడం విశేషం. భాషా నిలయం ఉపాధ్యక్షుడు న్యాలకొండ భాస్కర్‌రావు అధ్యక్షతన జరిగిన ఈ వేడుకల్లో భాషా నిలయం ప్రధాన కార్య దర్శి కుందావజ్జుల కృష్ణమూర్తి, జాతీయ సాహిత్య పరిషత్ కార్య దర్శి తాడిచర్ల రవి మాట్లాడుతూ.. ఉగాది పండగకు తెలుగు సాహిత్యానికి అవినాభావ సంబంధం ఉందన్నారు. నూతన సంవత్సరాన్ని స్వాగతిస్తూ సంస్కృతి, సంప్రదాయాలకు పెద్దపీట వేస్తూ తాము ఈ కవి సమ్మేళనం నిర్వహిస్తున్నట్లు చెప్పారు. శనిగరపు రాజమోహన్, గజవెల్లి నర్సింహస్వామి, ఉదయశ్రీ ప్రభాకర్, దేశిని శ్రీధర్, అరుణ కీర్తిపతాక, తాడూరి అరుణ, గన్నోజు ప్రసాద్, సముద్రాల కుమారస్వామి, తదితర కవులు అద్భుత కవితాగానాలు చేసి శ్రోతలను అలరింపజేశారు. ఈ సందర్భంగా కవులందరినీ నిర్వాహకులు సముచితంగా సత్కరించారు.

భాషోపాధ్యాయ సంఘం ఆధ్వర్యంలో..

హనుమకొండ సాయిబాబా ఆలయ కల్యాణ మండపంలో శుక్రవారం రాత్రి రాష్ట్ర భాషోపాధ్యాయ సంస్థ ఉమ్మడి జిల్లా ఆధ్వర్యంలో విశ్వావసు నామ ఉగాది వేడుకలను పెద్ద ఎత్తున నిర్వహించారు. భాషోపాధ్యాయ సంస్థ ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు డాక్టర్ అడ్లూరి వెంకటేశ్వర్లు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో సంస్థ రాష్ట్ర అధ్యక్షుడు చక్రవర్తుల శ్రీనివాస్ మాట్లాడుతూ.. భాషోపాధ్యాయులు చేస్తున్న సేవలను గుర్తిస్తూ ఈసారి తెలుగు, హిందీ ఉపాధ్యాయులనే కాక ఆంగ్ల భాషోపాధ్యాయులను కూడా తమ సంస్థ ద్వారా సత్కరింపజేస్తున్నట్లు చెప్పారు. వీరితోపాటు పలువురు గెజిటెడ్ ప్రధానోపాధ్యాయులను కూడా వారి సేవలను గుర్తించి ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారాలను అందజేస్తున్నామన్నారు. సత్కారం అందుకున్న ప్రధానోపాధ్యాయులు కె.రాజన్న ములుగు, బి.అన్నపూర్ణ భూపాలపల్లి, ఎం.సునీతరాణి హనుమకొండ, ఎడబాటి సంపత్‌రావు వరంగల్, గుమ్మడి లక్ష్మీనారాయణ మహబూబాబాద్, కె.నర్సింహారెడ్డి జనగామలను ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారాలు అందజేశామన్నారు. ఆంగ్ల విభాగం నుంచి ఈసారి కె.శ్రీనివాస్‌రెడ్డి, సంపత్, రవిశంకర్, టి.నరేందర్, ఆర్.శ్రీధర్, ఎస్.మమత, టి.వెంకటేశ్వర్‌రావు, బి.అనిత, సత్యనారాయణ, తెగులు విభాగం నుంచి విష్ణుమూర్తి, లత, వంశీకృష్ణ, ఎస్.మురళీ, అరుణ, పద్మ, రవీందర్, ఉదయశ్రీలకు, హిందీ విభాగం నుంచి మరో 8 మందిని ఎంపిక చేసి ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారాలను ప్రదానం చేశారు. అంతేగాక ఉగాది కవి సమ్మేళనంలో పాల్గొన్న కవులను కూడా సత్కరించారు. వరంగల్ డీఈవో ఎం.జ్ఞానేశ్వర్, ఏఎంఓలు సృజన్ తేజ, అంబటి శ్రీనివాస్‌రెడ్డి, భాషోపాధ్యాయ సంస్థ నాయకులు సిహెచ్. చంద్రమోహన్, పెండ్యాల బ్రహ్మయ్య, షేక్ హజీ నూరారీ, మర్రిపెల్లి రమేశ్, పాలోజు శ్రీహరి, ముదుంబై ప్రవీణ్, గుండు రవి, కానుగుల భద్రయ్య, పి.శ్రీనివాసచారి, టి.పద్మ తదితరులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ మడత భాస్కర్ రాసిన నానీల శిల్పాలు గ్రంథాన్ని చక్రవర్తుల శ్రీనివాస్ అంకితంగా అందుకున్నారు. నాలుగు గంటల పాటు ఏకధాటిగా ఈ కార్యక్రమం ఉల్లాసంగా జరిగింది.



కవి సమ్మేళనంలో పాల్గొన్న కవయిత్రులు

కేయూ పార్ట్ టైమ్ అధ్యాపకుల ఆశలపై నీళ్లు

- కేయూ బడ్జెట్ ప్రతిపాదనలకు ఆమోదం
- వాడీవేడిగా కేయూ పాలకమండలి సమావేశం

కేయూ క్యాంపస్, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): కేయూలో పనిచేస్తున్న పార్టుటైమ్ అధ్యాపకుల కాంట్రాక్టు ఆశలపై వర్సిటీ పాలక మండలి నీళ్లు చల్లింది. శుక్రవారం హైదరాబాద్ సెక్రటేరియట్‌లో కేయూ అత్యున్నత పాలకమండలి సమావేశం జరిగింది. కేయూ వీసీ కర్నాటి ప్రతాప్‌రెడ్డి, రిజిస్ట్రార్ వల్లూరి రామచంద్రం, రాష్ట్ర విద్యాశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ యోగితారాణా, హయ్యర్ ఎడ్యుకేషన్ సెక్రటరీ శ్రీదేవసేనా, రాష్ట్ర ప్రభుత్వ ఆర్థిక శాఖ డిప్యూటీ సెక్రటరీ సుజాత, కేయూ పాలక మండలి సభ్యులు ప్రొఫెసర్ నిమ్మ సుదర్శన్, ప్రొఫెసర్ బి.సురేశ్‌లాల్, డాక్టర్ వి.నవీన్, డాక్టర్ రమ, డాక్టర్ చిర్రా రాజు గౌడ్, డాక్టర్ సుకుమారి, డాక్టర్ అనితారెడ్డిలు హాజరయ్యారు. ఈ సందర్భంగా పాలక మండలిలో వర్సిటీలో ప్రధాన ఎజెండాగా వర్సిటీ 2023-24 ఆర్థిక సంవత్సర బడ్జెట్ ప్రతిపాదనలపై చర్చించారు. రూ.4.8కోట్ల బడ్జెట్ ప్రతిపాదనలకు కేయూ పాలక మండలి ఫైనాన్స్ కమిటీ ఆమోద ముద్ర వేశారు. అలాగే రాష్ట్ర ప్రభుత్వం వర్సిటీల్లో పనిచేసే అధ్యాపకుల ఉద్యోగ విరమణ వయస్సును 65 ఏళ్లకు పెంచుతూ తీసుకున్న నిర్ణయానికి ఓకే చెప్పింది. అయితే ప్రభుత్వం వెలువరించిన జీవోను కచ్చితంగా అమలు చేయాలని కీలక నిర్ణయం వెలువరించింది. ఒక్కరోజు తేడాతో ఉద్యోగ విరమణ చేసిన వారికి జీవో వర్తించదని కరాఖండిగా నిర్ణయం తీసుకుంది. జీవో మేరకు మళ్లీ వర్సిటీలో నియమితులైన కాంట్రాక్టు, రెగ్యులర్ ప్రొఫెసర్లపై ఏమైనా సందేహాలుంటే సవరించాలని సూచించారు. పెంచిన వయస్సును జీవోను అనుసరించి ఇటీవల పునర్నియమితులైన ముగ్గురు కాంట్రాక్టు అధ్యాపకుల నియామకాలకు పాలకమండలి ఆమోదముద్ర వేయకుండా మరోసారి సరిచూడాలని సూచించారు.

కాన్వకేషన్, తెలంగాణ సైన్స్ కాంగ్రెస్‌కు ఏర్పాట్లు

వర్సిటీలో కాన్వకేషన్, తెలంగాణ సైన్స్ కాంగ్రెస్ జరుపుకునేందుకు పచ్చజెండా ఊపారు. కాన్వకేషన్‌ను ఏప్రిల్ ఆఖరువారంలో కానీ మే మొదటి వారంలో చేసేందుకు తేదీలను చూపారు. వర్సిటీ గోల్డెన్ జూబ్లీ ఉత్సవాలను పురస్కరించుకుని ఆగస్టులో తెలంగాణ సైన్స్ కాంగ్రెస్ నిర్వహణకు సమ్మతించారు. ఆయా ఏర్పాట్లు, నిర్వహణ పనులు చేసుకోవాలని ఈసీ వర్సిటీ అధికారులకు సూచించింది. కాకతీయ యూనివర్సిటీ ఆరోగ్యకేంద్రంలో కొత్తగా మెడికల్ ఆఫీసర్లను నియమించుకునేందుకు పాలకమండలి సమ్మతించింది. అయితే డీఎంహెచ్‌వో అధికారుల నిర్దేశాలను చూడాలని సూచనలు చేశారు.

ప్రహరీ, భవనాలపై తిరకాసు

కేయూలో ప్రహరీ నిర్మాణంతో పాటు భవనాల అనుమతి కోసం వర్సిటీ అధికారులు రూపొందించిన ప్రతిపాదనలు అంశాలన్నీ సక్రమంగా లేవని పాలక మండలి తిరస్కరించింది. భవనాల నిర్మాణాలు, ప్రహరీపై కచ్చితమైన వివరాలతో నివేదికను సిద్ధం చేయాలని సూచించారు. అలాగే బిల్డింగ్ డివిజన్‌లో అవసరాల కోసం తాత్కాలిక సిబ్బంది నియామకాల కోసం టెక్నికల్ స్టాఫ్ కావాలని చేసిన విజ్ఞప్తిని పెండింగ్‌లో పెట్టారు. ప్లంబర్‌తో పాటు ఇతర అవసరాల కోసం వర్సిటీలో ఎక్సెస్‌లో ఉన్న బోధనేతర సిబ్బందిని వినియోగించుకోవాలని సూచించారు.

రూ.4.8 కోట్లకు బడ్జెట్ ఫైనాన్స్ కమిటీ ఆమోదం

కేయూ పాలకమండలి ఈ ఏడాదికి బడ్జెట్ ప్రతిపాదనలకు కేయూ ఫైనాన్స్ కమిటీ ఒకే చెప్పింది. వర్సిటీ ఫైనాన్స్ కమిటీలో కేయూ వీసీ, రిజిస్ట్రార్లతో పాటు పాలక మండలిలో నామినీలు ప్రొఫెసర్ బి.సురేశ్‌లాల్, డాక్టర్ కారుకాల అనితారెడ్డి, ఫైనాన్స్ ఆఫీసర్ తోట రాజయ్యతో పాటు ఇతర సిబ్బంది పాల్గొన్నారు. వర్సిటీలో ప్రధాన ఎజెండాగా వర్సిటీ 2025-26 ఆర్థిక సంవత్సర బడ్జెట్ ప్రతిపాదనలపై చర్చించారు. రూ.4.8కోట్ల బడ్జెట్ ప్రతిపాదనలకు కేయూ ఫైనాన్స్ కమిటీ ఆమోద ముద్ర వేశారు.



రిజిస్ట్రార్ నియామకానికి ఓకే

కేయూలో ఇటీవల రిజిస్ట్రార్‌గా నియమితులైన వల్లూరి రామచంద్రం నియామకానికి పాలక మండలి ఓకే చెప్పింది. రిజిస్ట్రార్‌తో పాటు ఇతర పరిపాలన అధికారుల నియామకాలను ఆమోదించారు.

టేబుల్ ఎజెండాలు వద్దు

పాలక మండలి సమావేశాల్లో గతంలో మాదిరిగా టేబుల్ ఎజెండాలు తీసుకురావద్దని ప్రిన్సిపల్ సెక్రటరీ యోగితా రాణా స్పష్టమైన అదేశాలిచ్చారు. నిర్ధిష్టమైన షెడ్యూల్ మేరకు ముందుగా ఇచ్చిన ఎజెండాలోని అంశాలపైనే పాలక మండలిలో చర్చలు, అమోదముద్ర ఉంటుందని తెల్చి చెప్పారు. టేబుల్ ఎజెండాలు వద్దని సున్నితమైన హెచ్చరికలు జారీ చేశారు.

పాలక మండలి వద్దకు అశోక్‌బాబు

హైదరాబాద్ సెక్రటేరియట్‌లో శుక్రవారం జరిగిన వర్సిటీ పాలక మండలి సమావేశం వద్దకు వర్సిటీలో సస్పెన్షన్ వేటులో ఉన్న ఏఆర్ పి.అశోక్‌బాబు వెళ్లారు. రాష్ట్ర ప్రిన్సిపల్ సెక్రటరీ యోగితారాణా, ఇతర పాలక మండలి సభ్యులను కలిసేందుకు ప్రయత్నించారు. తనతో తెచ్చుకున్న పత్రాలను చూపేందుకు ప్రయత్నించారు అయితే యోగితారాణి సిబ్బంది అశోక్‌బాబును వద్దంటూ వెనక్కి పంపించారు. అలాగే ఇతర పాలక మండలి సభ్యులను కలిసేందుకు ప్రయత్నించినా ససేమిరా అన్నట్లు తెలిసింది. అయి తే అశోక్‌బాబుపై టేబుల్ ఎజెండాగా ప్రస్తావించేందుకు వర్సిటీ అధికా రులు ప్రయత్నించగా అప్పటికే ప్రిన్సిపల్ సెక్రటరీ టేబుల్ ఎజెండాలు వద్దంటూ సూచించారు. దీంతో అశోక్‌బాబు అంశం పెండింగ్‌లో పడినట్లయింది.

హాట్‌హాట్‌గా పాలక మండలి సమావేశం

కేయూ పాలక మండలి సమావేశం శుక్రవారం హైదరాబాద్‌లో హాట్‌హాట్‌గా జరిగింది. ప్రిన్సిపల్ సెక్రటరీ యోగితారాణి ప్రతీ అంశాన్ని రూల్స్, యూజీసీ గైడ్‌లైన్ మేరకు ఉన్నాయా..? పాలక మండలి పరిధిలోకి వచ్చే అంశాలు ఏమిటీ..? అలాగే రాష్ట్ర ప్రభుత్వం తీసుకోవాల్సిన నిర్ణయాలు ఏమిటనే అంశాలపై వర్సిటీ అధికారులతో చర్చించారు. ప్రతీది కచ్చితంగా నిబంధనల మేరకే చేయాలని అదేశాలిచ్చారు. వర్సిటీ ఉన్నతాధికారులు ఏది చెప్పినా రూల్స్‌లో ఇదెక్కడుంది..? ఏమని ఉంది? అనే అంశాలను ఆరా తీసినట్లు సమాచారం. పార్టుటైమ్ టూ కాంట్రాక్టు కన్వర్షేషన్ రాష్ట్ర ప్రభుత్వం పరిధిలో నిర్ణయం తీసుకోవాలనే సూచనలు చేసినట్లు తెలిసింది.

ఇనుగుర్తి మస్జీద్ కమిటీ ఎన్నిక



మహ్మద్ నబీ
అధ్యక్షుడు

ఇనుగుర్తి, మార్చి 28 (ఆంధ్రజ్యోతి) : ఇనుగుర్తిలోని మస్జీద్-ఏ-అక్స నూతన కమిటీని గురువారం రాత్రి ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ కమిటీ అధ్యక్షుడిగా మహమ్మద్ నబీ మూడోసారి ఎన్నిక కాగా.. ఉపాధ్యక్షుడిగా మహ్మద్ అమీర్, కార్యవర్గ సభ్యులుగా ఖలీల్, షేక్ యాకూబ్‌పాష, జలీల్, సలీం, మహబూబ్ పాష, హకీమ్, యాకూబ్ పాష, గౌరవ అధ్యక్షులుగా తాజొద్దిన్‌ఖాన్, అమీర్‌లను ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో అబ్దుల్ రహమాన్ పాల్గొన్నారు.



మానుకోటలోని మస్జిదే ఉమర్ ఫారూక్‌లో శాంతియుత నిరసన తెలుపుతున్న ముస్లింలు

వక్ఫ్ సవరణ బిల్లుకు వ్యతిరేకంగా నిరసన

మహబూబాబాద్, మార్చి28 (ఆంధ్రజ్యోతి) : ఆలిండియా ముస్లిం పర్సనల్లా బోర్డు (ఏఐఎంపీఎల్‌బీ) పిలుపు మేరకు వక్ఫ్ సవరణ బిల్లు 2024కు వ్యతిరేకంగా మహబూబాబాద్‌లో ముస్లింలందరూ శుక్రవారం శాంతియుతంగా నిరసన తెలిపారు. రంజాన్ మాసంలో చివరి శుక్రవారం మస్జీద్‌లకు వచ్చే ముందు ప్రతీ ముస్లిం ఇంటి నుంచి నల్లబ్యాడ్జి చేతికి కట్టుకుని వచ్చి నమాజ్ అనంతరం మహబూబాబాద్‌లోని మస్జీద్‌లలో నిరసన చేపట్టారు.

● మరిపెడ, (ఆంధ్రజ్యోతి) : వక్ఫ్ బోర్డు సవరణ బిల్లుపై సీతారాంపూర్ మసీద్ పరిధికి చెందిన పలువురు ముస్లింలు నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ముస్లిం మైనార్టీ సంఘ నేతలు లతీఫ్, సర్వర్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం వక్ఫ్ బోర్డుకు చెందిన వేల ఎకరాల భూములను కార్పొరేట్ సంస్థలకు అప్పచెప్పడానికి ఇట్లాంటి సవరణ బిల్లులు తెస్తుందని విమర్శించారు. వెంటనే బీజేపీ ప్రభుత్వం ముస్లింల వ్యతిరేక బిల్లులను ఉపసంహరించుకోవాలన్నారు. ఈ నిరసనలో స్థానిక ముస్లింలు పాల్గొన్నారు.

స్కావెంజర్ల సమస్యలను పరిష్కరించాలి

నెల్లికుదురు, మార్చి28 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ పాఠశాలల్లో పనిచేస్తున్న స్కావేంజర్ల సమస్యలు పరిష్కరించాలని సంఘం జిల్లా కన్వీనర్ ఇసంపెల్లి సదులు డిమాండ్ చేశారు. నెల్లికుదురులో శుక్ర వారం ఆయన మాట్లాడుతూ పాఠశాలల్లో టాయిలెట్‌లు, గదులు శుభ్రపరుస్తున్నప్పటికి వేతనాలు ఇవ్వకుండా వెట్టిచాకిరి చేయించుకుంటున్నారన్నారు. గత 6 నెలలుగా వేతనాలు లేక స్కావేంజర్‌లు ఉగాది పండుగకు పస్తులుగా ఉండవలసిన పరిస్థితి నెలకొందన్నారు. ఇప్పటికైనా వేతనాలు ఇచ్చి ఆదుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో వెంకన్న, ఐలమ్మ సీతమ్మ, ముత్తయ్య పాల్గొన్నారు.



మద్రాస్ యూనివర్సిటీలో సన్మానం పొందుతున్న ఈసం అమర్‌నాథ్

కవి అమర్‌నాథ్‌కు ఘన సన్మానం

కొత్తగూడ, మార్చి 28 (ఆంధ్రజ్యోతి) : కొత్తగూడ మండలంలోని ముస్మీ గ్రామానికి చెందిన ఉపాధ్యాయుడు, రచయిత, కవి ఈసం అమర్‌నాథ్‌కు తమిళనాడు రాష్ట్రం చెన్నైలోని మద్రాస్ యూనివర్సిటీలో శుక్రవారం ఘనంగా సన్మానించారు. చెన్నైలోని మద్రాస్ విశ్వవిద్యాయంలో ఉగాది పండుగ సందర్భంగా జాతీయ ఉగాది కవి సమ్మేళనం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సమ్మేళనంలో ప్రతిభ కనబరచిన అమర్‌నాథ్‌ను కవితా గానం, ఉగాది పురస్కారంతో ఘనంగా సన్మానించారు. కాగా, అమర్‌నాథ్‌కు పలువురు శుభాకాంక్షలు తెలిపారు.

వేలం తర్వాత.. మిర్చి తారుమారు

- నాసిరకం సరుకును అన్నదాత పేరుతో విక్రయించే యత్నం
- లేని రైతు పేరుతో గేట్ ఎంట్రీ టోకెన్
- మోసం చేసేందుకు యత్నించిన చిల్లర వ్యాపారి



కేసముద్రం మార్కెట్లో మిర్చి బస్తాలు తారుమారయ్యాయని చూపుతున్న వ్యాపారి శ్రీనివాస్‌రెడ్డి

కేసముద్రం, మార్చి 28 (ఆంధ్రజ్యోతి) : కేసముద్రం వ్యవసాయ మార్కెట్లో శుక్రవారం సాయంత్రం మిర్చి బస్తాలు తారుమారయ్యాయని వ్యాపారులు తోకల శ్రీనివాస్‌రెడ్డి, నవీన్‌లు ఆరోపించారు. వ్యాపారులు, మార్కెట్ ప్రత్యేక హోదా కార్యదర్శి అమరలింగేశ్వర్‌రావు తెలిపిన ప్రకారం. మార్కెట్‌కు ఉదయం 'అనీల్‌కుమార్, కార్ల గ్రామం పేరుతో 14 బస్తాల మిర్చిని ఈ-నామ్‌లోని గేట్ ఎంట్రీ టోకెన్ తీసుకొని యార్డులో వేశాడు. సదరు వ్యాపారులు 'ఈ-వేలం'లో రూ.8వేల ధరతో ఆ సరుకును దక్కించుకొని, సాయంత్రం కాంటాలు నిర్వహించేందుకు వ్యాపారి వెళ్లగా నాసీరకమైన మిర్చి ఉన్నట్లు గుర్తించారు. పైగా ఉదయం సరుకు ఒకచోట వేలం వేయగా సాయంత్రం మరోచోట బస్తాలు ఉన్నాయి.

దీంతో అనుమానం వచ్చిన వ్యాపారులు మార్కెట్ ప్రత్యేక హోదా కార్యదర్శి అమరలింగేశ్వర్‌రావుకు ఫిర్యాదు చేశారు. ఈ బస్తాలకు సంబంధించిన రైతుగా ఓ వ్యక్తి వచ్చి ఆ బస్తాలు తన వేనని బయట విక్రయించేందుకు యార్డులోంచి తీసుకు వెళ్లానని, ధర పడకపోయేసరికి తిరిగి తీసుకువచ్చినట్లు వ్యాపారులకు, మార్కెట్ అధికారులకు తెలిపాడు. బయటకు వెళ్లిన సరుకును తూకం వేసే ప్రసక్తి లేదని, మళ్లీ వేలంలో పెట్టి విక్రయించుకోవాలని అధికారులు సూచించారు. చీటీలో రాయించిన అనీల్‌కుమార్ ఎవరని ఆ వ్యక్తిని ప్రశ్నించగా సమాధానం దాటవేస్తున్నాడు. అయితే రైతుగా చెప్పుకున్న చిల్లరకాంటాలు నిర్వహించే ఆ వ్యక్తి మరోసారి ఇలా జరగకుండా చూసుకుంటానని క్షమాపణ లేఖ రాసి తన సరుకును తీసుకువెళ్లినట్లు మార్కెట్ కార్యదర్శి తెలిపారు.

పంజాబ్ రైతులపై పెట్టిన కేసులను ఎత్తివేయాలి



మహబూబాబాద్ వ్యవసాయ మార్కెట్ సమీపంలో రాస్తారోకో చేస్తున్న ఎస్‌కేఎం నేతలు

మహబూబాబాద్ టౌన్, మార్చి 28 (ఆంధ్రజ్యోతి) : పంజాబ్ రైతులపై కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం, పంజాబ్ రాష్ట్రంలో ఆమ్‌ఆద్మీ ప్రభుత్వం పెట్టిన అక్రమ కేసులన్నింటిని ఎత్తివేయాలని అఖిల భారత రైతుకూలీ సంఘం రాష్ట్ర కోశాధికారి నందగిరి వెంకటేశ్వర్లు, ఏఐపీకేయూ రాష్ట్ర సహాయ కార్యదర్శి పాయం చిన్న చంద్రన్న డిమాండ్ చేశారు. మహబూబాబాద్ జిల్లా కేంద్రంలో సంయుక్త కిసాన్ మోర్చా (ఎస్‌కేఎం) ఆధ్వర్యంలో శుక్రవారం జిల్లా కేంద్రంలోని వ్యవసాయ మార్కెట్ సెంటర్‌లో రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం, పంజాబ్ రాష్ట్రంలోని ఆమ్‌ఆద్మీ ప్రభుత్వాలు రెండుకూడా కార్పొరేట్ శక్తులకు వ్యవసాయరంగాన్ని కట్టబెట్టడానికి మూడు నల్లచట్టాలను తీసుకువచ్చిందని, వాటిని పార్లమెంట్ ద్వారా రద్దు చేస్తామని చెప్పి నేటికి రద్దు చేయకపోవడం బాధకరమన్నారు. ఇప్పటికైనా ఆ నల్లచట్టాలను రద్దు చేయడంతో పాటు పంజాబ్ రైతులపై పెట్టిన కేసులు ఎత్తివేసేంత వరకు ఆందోళన కార్యక్రమాలు నిర్వహిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో గుజ్జు దేవేందర్, పొమ్మయ్య, బండారి ఐలయ్య, లింగన్న, భాస్కర్ రెడ్డి, బండపల్లి వెంకటేశ్వర్లు, ఎస్‌కె.తాజ్‌పాష, ఆలకుంట్ల సాయిలు, బిక్షపతి, ఎస్‌కె.బాబన్న, సామ పాపయ్య పాల్గొన్నారు.

పశు వైద్యుడిని నియమించాలి

మరిపెడ, మార్చి 28 (ఆంధ్రజ్యోతి) : చిల్లంచర్ల పశు వైద్యశాలకు వెటర్నరీ డాక్టర్ లేక అక్కడి పశు సంపదను స్థానిక రైతులు నష్టపోతున్నారని సీపీఎం మరిపెడ మండల కార్యదర్శి గుండగాని మధుసూదన్ ఆరోపించారు. శుక్రవారం ఆ పార్టీ బృందం వివిధ అంశాలపై ఆ ఊళ్లో సర్వే చేపట్టగా, పశు వైద్యశాలకు సంవత్సరం నుంచి డాక్టర్ లేక పశువులు, గొర్రెలు, మేకలు, కోళ్ల తదితర పశు సంపద రోగాల బారినపడి మృతి చెందాయన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు వెంకన్న, రాంబాబు, శ్రీను, సారంగం, ఉప్పలయ్య, ధనుంజయ, లక్కి తదితరులు పాల్గొన్నారు.

దేశం అబ్బురపడేలా తెలంగాణ అభివృద్ధి

పెద్దవంగర, మార్చి28 (ఆంధ్రజ్యోతి) : దేశం అబ్బురపడేలా తెలంగాణలో అభివృద్ధి, సంక్షేమ ఫలాలు కొనసాగుతున్నాయని కాంగ్రెస్ పార్టీ పాలకుర్తి నియోజకవర్గ ఇన్‌చార్జ్ హనుమాండ్ల ఝాన్సీరెడ్డి తెలిపారు. గురువారం మండల కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ ముఖ్యకార్యకర్తల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నియోజకవర్గ ప్రజలను, కార్యకర్తలను కంటికి రెప్పలా కాపాడుకుంటామని తెలిపారు. కాంగ్రెస్ పార్టీ ప్రవేశపెట్టిన ఆరు గ్యారెంటీలను అర్హులైన ప్రతీ ఒక్కరికి అందిస్తామన్నారు. గ్రామాల్లో ఉన్న సమస్యలను సత్వరమే పరిష్కారిస్తామన్నారు. ప్రజా సంక్షేమమే ధ్యేయంగా పనిచేస్తున్న సర్కారుపై ప్రతిపక్షాలు కుట్రలు పన్నుతున్నాయని వాటిని తిప్పికొట్టాలన్నారు. ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ, అభివృద్ధి పథకాలను ప్రజలకు తెలియజేయాలన్నారు. మండలస్థాయి, గ్రామస్థాయి నాయకులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో గ్రామాల్లో కాంగ్రెస్ జెండానే ఎగురుతుందని ధీమా వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ముద్దసాని సురేష్, కాంగ్రెస్ నాయకులు జాటోతు నెహ్రూనాయక్, హమ్యానాయక్, విజయ్‌పాల్‌రెడ్డి, గోపాల్, రంగు మురళి, హరికృష్ణ, సైదులు, దేవేంద్ర, రవీందర్‌రెడ్డి, వెంకన్న, పూర్ణచందర్, సత్యం, శ్రీనివాస్, ఉప్పలయ్య, సమ్మయ్య పాల్గొన్నారు.

ఎస్పీని కలిసిన బీజేపీ నేతలు

మహబూబాబాద్ రూరల్, మార్చి28 (ఆంధ్రజ్యోతి) : మహబూబాబాద్ జిల్లా ఎస్పీ సుధీర్‌రామ్‌నాథ్ కేకన్‌ను మహబూబాబాద్ బీజేపీ జిల్లా అధ్యక్షుడు వల్లభు వెంకటేశ్వర్లు శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిశారు. జిల్లా కేంద్రంలోని సూపరిండెంట్ ఆఫ్ పోలీస్ కార్యాలయంలో ఎస్పీ సుధీర్‌రామ్‌నాథ్ కేకన్‌ను కలిసి శాలువాతో సత్కరించి, మొక్కను బహూకరించారు. ఈ సందర్భంగా బీజేపీ జిల్లా అధ్యక్షుడు వల్లభు వెంకటేశ్వర్లు మాట్లాడుతూ జిల్లాలో శాంతిభద్రతల పరిరక్షణ కోసం చేపడుతున్న చర్యలు అభినందనీయమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నేతలు చీకటి మహేష్‌గౌడ్, సింగారపు సతీష్, గడ్డం అశోక్, వెన్నమల్ల అజయ్‌కుమార్, జహేందర్‌నాయక్, గుగులోతు రాంబాబునాయక్, పల్లె సందీప్, వెన్నమల్ల సందీప్, నరేష్‌నాయక్ తదితరులు పాల్గొన్నారు.



ఎస్పీ సుధీర్‌రామ్‌నాథ్ కేకన్‌ను మర్యాదపూర్వకంగా కలిసి మొక్కను అందచేస్తున్న బీజేపీ నేతలు

'రాజీవ్ యువ వికాస్'ను వినియోగించుకోవాలి

మహబూబాబాద్, మార్చి 28 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రంలోని మైనార్టీ (ముస్లిం, క్రిస్టియన్, సిక్కు, బౌద్ధ, జైన్, పార్శీ) వర్గాలకు చెందిన నిరుద్యోగ యువతకు స్వయం ఉపాధి పొందేందుకు రాజీవ్‌యువ వికాస్ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని జిల్లా మైనార్టీ సంక్షేమశాఖ అధికారి శ్రీనివాస్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలో అర్హత, అసక్తి గలవారు వెబ్‌సైట్ https://tgobmmsnew.cgg.gov.in ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఆన్‌లైన్ దరఖాస్తు చేసుకున్న గ్రామీణ ప్రాంతాల అభ్యర్థులు ఆయా ఎంపీడీవో కార్యాలయం, పట్టణ ప్రాంతాల వాసులు మునిసిపల్ కార్యాలయంలోని అవసరమైన పత్రాలతో పాటు హార్డ్‌కాపీని అందించాలని సూచించారు. ఏప్రిల్ 5వ తేదీ వరకు గడువు ఉన్నట్లు చెప్పారు.

బైండోవర్ ఉల్లంఘించిన వ్యక్తికి జైలు

తొర్రూరు, మార్చి 28 (ఆంధ్రజ్యోతి) : గుడుంబా రవాణా, తయారీ కేసులో పట్టుబడి బైండోవర్ ఉల్లంఘించిన వ్యక్తికి జైలు శిక్ష పడినట్లు తొర్రూరు ఎక్సైజ్ ఇన్‌చార్జి సీఐ ఆర్.ప్రవీణ్ తెలిపారు. శుక్రవారం స్టేషన్ ఆవరణలో ఆయన మాట్లాడుతూ స్టేషన్ పరిధిలోని పెద్దవంగర మండలం ఎల్‌బీ తండాకు చెందిన జాటోత్ రాజు గతంలో గుడుంబా తయారీ, విక్రయాలు జరుపుతూ పట్టుబడగా ఎక్సైజ్ అధికారులు తహసీల్దార్ ఎదుట బైండోవర్ చేశారు. బైండోవర్ ఉల్లంఘించి విక్రయాలు చేస్తుండడంతో కేసులు నమోదు కాగా, కోర్టులో హాజరుపర్చడంతో జడ్జి జైలుశిక్ష విధిస్తూ తీర్పు ఇచ్చారన్నారు. గుడుంబా అమ్మినా, విక్రయించినా చర్యలు తప్పవన్నారు.

'కాంగ్రెస్‌తోనే గ్రామాల అభివృద్ధి'

తొర్రూరు, మార్చి28 (ఆంధ్రజ్యోతి) : కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలోనే గ్రామాల అభివృద్ధి జరుగుతుందని తొర్రూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ హనుమాండ్ల తిరుపతిరెడ్డి అన్నారు. శుక్రవారం మండలంలోని చెర్లపాలెం, గోపాలగిరి గ్రామంలో సీసీ రోడ్ల నిర్మాణం కోసం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీఎం రేవంత్‌రెడ్డి ప్రజా ప్రభుత్వంలో గ్రామాల అభివృద్ధికి అత్యధిక నిధులు కేటాయిస్తున్నారని, రూ.10 లక్షలతో సీసీ రోడ్ల నిర్మాణ పనులు ప్రారంభిస్తున్నట్లు తెలిపారు. నాయకులు సుంచు సంతోష్, నరేందర్ రెడ్డి, రాజిరెడ్డి, లక్ష్మణ్, శ్రీనివాస్ ఉన్నారు.

బెట్టింగ్ రహిత జిల్లాగా మార్చాలి

నెహ్రూసెంటర్, మార్చి 28 (ఆంధ్రజ్యోతి) : స్మార్ట్‌ఫోన్‌లలోని బెట్టింగ్ యాప్‌లకు బానిసలై తమ కుటుంబాలను ఛిద్రం చేస్తున్న యాప్‌లను నియంత్రించి, మహబూబాబాద్‌ను బెట్టింగ్ రహిత జిల్లాగా మార్చాలని లంబాడి స్టూడెంట్ ఆర్గనైజేషన్ (ఎల్ఎస్‌వో) జిల్లా అధ్యక్షుడు గుగులోతు శివవర్మనాయక్ కోరారు. ఈ మేరకు జిల్లా పోలీస్‌కార్యాలయంలో ఎస్పీ సుధీర్‌రామ్‌నాథ్ కేకన్‌కు శుక్రవారం వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా శివవర్మ మాట్లాడుతూ.. జిల్లాలో బెట్టింగ్ యాప్‌లతోపాటు నిత్యం గంజాయి మత్తుకు బానిసైన కొందరు వికృతచేష్టలకు పాల్పడుతున్నారని ఆరోపించారు. గంజాయి, బెట్టింగ్ యాప్‌ల నిర్మూలన కోసం స్పెషల్ డ్రైవ్ నిర్వహించాలని విజ్ఞప్తి చేశారు. వెంకటేష్, మాలోతు రమేష్, జవహర్‌లాల్, రాజశేఖర్ పాల్గొన్నారు.

మార్కెట్ బయట కొనుగోళ్లను బంద్ చేయాలి

కేసముద్రం, మార్చి28 (ఆంధ్రజ్యోతి) : కేసముద్రం మార్కెట్ బయట వ్యాపారులు నేరుగా రైతుల నుంచి సరుకుల కొనుగోళ్లతో ప్రజలకు ఇబ్బందులు తలెత్తుతున్నాయని, వీటిని వెంటనే బంద్ చేయాలని మహబూబాబాద్ రూరల్ సీఐ సర్వయ్య ఆదేశించారు. మార్కెట్ కార్యాలయంలో శుక్రవారం వ్యాపారస్తులు, కార్మిక సంఘాలసమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ బయట ఖరీదులు చేయకుండా వ్యాపారులకు, వేబ్రిడ్జి నిర్వాహకులకు నోటీసులు ఇవ్వనున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో ఎస్ఐ మురళీధర్‌రాజ్, ప్రత్యేక హోదా కార్యదర్శి అమరలింగేశ్వర్‌రావు, మార్కెట్ కమిటీ సభ్యుడు చిదిరాల వసంతరావు పాల్గొన్నారు.

గుండెపోటుతో జర్నలిస్టు మృతి



యాకుబ్‌మియా (ఫైల్)

గార్ల, మార్చి28 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలో సుదీర్ఘకాలం పాటు ఓ దినపత్రికలో పనిచేసిన యాకుబ్‌మియా (58) శుక్రవారం గుండెపోటుతో మృతి చెందాడు. కొంతకాలం తర్వాత ఆ పత్రిక వెలువడక పోవడంతో గార్లలో ప్రైవేటు రైటర్ పనిచేస్తూ ఆయన జీవనం సాగిస్తున్నాడు. ఈ క్రమంలో యాకుబ్ గుండె పోటుతో మృతి చెందాడు. మృతుడికి భార్య ఇద్దరు కుమారులు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. పట్ల సీపీఐ, సీపీఎం కాం గ్రెస్, బీఆర్ఎస్, టీడీపీ, బీజేపీ పలువురు ప్రముఖులు కట్టిబోయిన శ్రీనివాస్, కందునూరి శ్రీనివాస్, దనియాకుల రామారావు, గంగావత్ లక్ష్మణ్‌నాయక్, ఎలమరెడ్డి కృష్ణారెడ్డి, విమల్ కుమార్ జైన్, పీఏసీఎస్ చైర్మన్ వడ్లమూడి దుర్గాప్రసాద్ యాకుబ్‌మియాకు నివాళులర్పించారు.

సూళ్లలో పూర్వ ప్రాథమిక తరగతులు ప్రారంభించాలి

మహబూబాబాద్ ఎడ్యుకేషన్, మార్చి 28 (ఆంధ్రజ్యోతి) : ప్రాథమిక పాఠశాలల్లో పూర్వ ప్రాథమిక తరగతులు ప్రారంభించి, విద్యారంగానికి బడ్జెట్‌లో 15 శాతం నిధులు కేటాయించాలని టీఎస్‌యూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు చావ రవి ప్రభుత్వాన్ని కోరారు. మహబూబాబాద్ జిల్లా కేంద్రంలోని యూటీఎఫ్ కార్యాలయంలో శుక్రవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. విద్యారంగానికి రాష్ట్రప్రభుత్వం బడ్జెట్‌లో కనీసం 15 శాతం నిధులు కేటాయించాలని, క్రమంగా దానిని 20 శాతంకు పెంచాలన్నారు. వచ్చే విద్యాసంవత్సరం నుంచే ప్రాథమిక పాఠశాలల బలోపేతం కోసం ప్రత్యేక కేంద్రీకరణ జరగాలని, పూర్వ ప్రాథమిక తరగతులను ప్రారంభించి ప్రతీ తరగతికి ఒక టీచర్ చొప్పున ఐదుగురు టీచర్లను, ఒక హెచ్‌ఎం ఉండేలా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. వేసవి సెలవుల్లో ఉపాధ్యాయుల బదిలీలు చేపట్టాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో యూనియన్ నాయకులు మురళీకృష్ణ, సామ మల్లారెడ్డి, షేక్ యాకూబ్, సామ వెంకటేశ్వర్లు, ఎన్.స్వప్న, నాగమల్లయ్య, భద్రునాయక్, వివేక్, మంజుల, జనార్దనాచారి, హరినాయక్, సంజీవ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న టీఎస్‌యూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు రవి

బంజారా గోర్ భాషను 8వ షెడ్యూల్‌లో చేర్చడం హర్షణీయం



బంజారాల సమావేశంలో మాట్లాడుతున్న వీరన్ననాయక్

కురవి, మార్చి 28 (ఆంధ్రజ్యోతి) : బంజారా గోర్‌బోలీ భాషను 8వ షెడ్యూల్‌లో చేర్చడం హర్షణీయమని కాంగ్రెస్ బంజార నాయకుడు వీరన్ననాయక్, లక్ష్మణ్‌నాయక్ అన్నారు. కురవిలో శుక్రవారం జరిగిన సమావేశంలో వారు మాట్లాడారు. 11 రాష్ట్రాల్లో 40 లక్షల మంది మాట్లాడే గోర్ భాషను అసెంబ్లీలో తీర్మానించేసి 8వ షెడ్యూల్‌లో చేర్చడం గొప్ప విషయమన్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, రాష్ట్ర మంత్రి జూపల్లి కృష్ణారావు, ప్రభుత్వవిప్, డోర్నకల్ ఎమ్మెల్యే జాటోత్ రాంచందర్‌నాయక్‌లకు ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో లూనావత్ విజయ్, డాక్టర్ కరుణాకర్, లింగ్యానాయక్, లక్ష్మణ్‌నాయక్, కరుణాకర్‌నాయక్, రాముక్‌నాయక్, తుకారంనాయక్, కృష్ణనాయక్, డీఎస్.చందులాల్, సుమన్, శ్రీను పాల్గొన్నారు.

'ఒకే దేశం.. ఒకే ఎన్నిక'తో దేశాభివృద్ధి

మహబూబాబాద్ రూరల్, మార్చి 28 (ఆంధ్రజ్యోతి) : ఒకే దేశం.. ఒకే ఎన్నికతో దేశం అభివృద్ధి చెందుతుందని ఒకే దేశం.. ఒకే ఎన్నిక జిల్లా ఇంచార్జ్, బీజేపీ జిల్లా మాజీ ప్రధాన కార్యదర్శి చీకటి మహేష్‌గౌడ్అన్నారు. మహబూబాబాద్ జిల్లా కేంద్రంలోని శుక్రవారం ఆ పార్టీ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ దేశంలో ఏదో ఒకరాష్ట్రంలో ఎన్నికలు జరుగుతుండడంతో ఆర్థికభారంతో పాటు అభివృద్ధి కుంటుపడుతుందని, దీంతో ఒకే దేశం.. ఒకే ఎన్నిక నినాదాన్ని ప్రధాని మోదీ తీసుకువచ్చారని చెప్పారు. 1984 సంవత్సరంలో బీజేపీ ఎన్నికల మేనిఫెస్టోలో ఈ అంశాన్ని పెట్టాయని, ప్రతిపక్షాలు సహకరించకపోవడం వల్ల అది కార్యరూపం దాల్చలేదన్నారు. బూత్‌స్థాయి నుంచి గ్రామ, మండల జిల్లాస్థాయి వరకు బీజేపీ నాయకులు, కార్యకర్తలు, ఈ అంశంపై ప్రజల్లో అవగాహన కల్పించాలని చెప్పారు. ఈ సమావేశంలో పట్టణాధ్యక్షుడు వెన్నమల్ల అజయ్, రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు క్యామవల్ శ్యాంసుందర్‌శర్మ, ఆకుల శ్రీనివాస్, సంపత్‌రావు, ఇందుభారతి, జెహేందర్‌నాయక్, సిరికొండ సంపత్, పల్లె సందీప్, ఓర్సు పద్మావతి పాల్గొన్నారు.

సేవాలాల్ సేన నాయకుల స్వీట్ల పంపిణీ

నెహ్రూసెంటర్, మార్చి 28 (ఆంధ్రజ్యోతి) : దేశవ్యాప్తంగా వివిధ రాష్ట్రాల్లో మాట్లాడే గోర్‌బోలీ భాషను రాజ్యాంగంలోని 8వ షెడ్యూల్‌లో చేర్చాలని తెలంగాణ అసెంబ్లీ ఏకగ్రీవంగా తీర్మాణం చేయడం పట్ల సేవాలాల్ సేన నాయకులు శుక్రవారం హర్షం వ్యక్తం చేశారు. అనంతరం మహబూబాబాద్‌లో మిఠాయిలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ప్రముఖ వైద్యులు నెహ్రూరాథోడ్ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం శాసనసభలో తీర్మాణం చేసి కేంద్రానికి పంపించడం శుభపరిణామమన్నారు. సేవాలాల్ సేన నాయకులు వెంకన్న, మోతీలాల్, నందులాల్, అర్జున్‌చౌహాన్,శంకర్, సుమన్,మల్సూర్, మాలు, చక్ర పాల్గొన్నారు.

ఉద్యమకారులను ఆదుకోవాలి

కేసముద్రం, మార్చి28 (ఆంధ్రజ్యోతి) : తెలంగాణ ఉద్యమకారుల కుటుంబంలో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం కల్పించి, రూ.10లక్షల పరిహారం అందించి, ఆదుకోవాలని కోరుతూ తహసీల్దార్ దామోదర్‌కు శుక్రవారం వారు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఉద్యమకారుల ఫోరం మండల అధ్యక్షుడు చాగంటి కిషన్ మాట్లాడుతూ ఉద్యమకారులకు నెలకు రూ.25వేల పించను ఇవ్వాలని, రాజీవ్ యువవికాసం పథకంలో ప్రాధాన్యతనివ్వాలని కోరారు. ఫోరం ప్రధాన కార్యదర్శి షేక్ ఖాదర్, చిట్యాల వీరన్న, జనిగల పరమేశ్వర్, దండు శ్రీనివాస్, మోడెం రవీందర్‌గౌడ్, దార్ల రాంమూర్తి, శివారపు శ్రీధర్, వేల్పుల రేవంత్, బాల్‌మోహన్, వేం నర్సింహారెడ్డి పాల్గొన్నారు.

ప్రభుత్వ విద్యపట్ల సీఎం కపట ప్రేమ

మహబూబాబాద్ ఎడ్యుకేషన్, మార్చి 28 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ విద్యారంగం పట్ల ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వ్యాఖ్యాలు మాటలు కోటలు దాటుతున్నాయి కానీ ఆచరణ మాత్రం గడపదాటడం లేదని టీపీటీఎఫ్ జిల్లా అధ్యక్షులు బలాష్టి రమేష్ అన్నారు. మహబూబాబాద్ జిల్లా కేంద్రంలోని ఆ సంఘం కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన సమావేశంలో రమేష్ మాట్లాడుతూ.. పాఠశాల అభివృద్ధికి నిధులు కేటాయించకుండ ఉపాధ్యాయులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించకుండా విద్యార్థుల సంఖ్య, విద్య నాణ్యత ఎలా పెరుగుతాయని ప్రశ్నించారు. రాష్ట్ర బడ్జెట్‌లో విద్యకు రూ.15 శాతంనిధులు కేటాయిస్తామని ఎన్నికల మేనిఫెస్టోలో పొందుపరిచి నేడు బడ్జెట్‌లో మాత్రం 7 శాతం కేటాయించారని చెప్పారు. దీంతో విద్యాప్రమాణాలు ఎలా పెరుగుతాయని విమర్శించారు. రాష్ట్ర కౌన్సిలర్ చుంచు శ్రీశైలం, రాచకొండ ఉపేందర్, విష్ణువర్ధన్, విద్యాసాగర్, లింగారెడ్డి, గోవర్ధన్, కార్తీక్, మోహన్, మురళీ పాల్గొన్నారు.

మురళీనాయక్‌కు మంత్రి పదవి ఇవ్వాలి

నెల్లికుదురు, మార్చి28 (ఆంధ్రజ్యోతి) : ఎమ్మెల్యే మురళీనాయక్‌కు మంత్రి పదవి ఇవ్వాలని ఎల్‌హెచ్‌పీఎస్ మండల నాయకుడు గుగులోత్ బాలాజీ నాయక్ తెలిపారు. మండల కేంద్రంలోఎల్‌హెచ్ పీఎస్ ఆధ్వర్యంలో శుక్రవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మురళీనాయక్ 50వేల మెజారిటీతో ఎమ్మెల్యేగా గెలుపొందాడని, మంత్రి వర్గంలో చోటు కల్పించాలన్నారు. బోజ్యానాయక్, భాస్కర్‌నాయక్, శ్రీనివాస్ నాయక్, రాజునాయక్, లింగ్యానాయక్, మంగీలాల్, సురేష్‌నాయక్, కిషన్‌నాయక్, మోహన్ తోరియా, రమేష్, నరేష్, పాల్గొన్నారు.

బీఆర్ఎస్ ఆధ్వర్యంలో ఇఫ్తార్ విందు

కేసముద్రం, మార్చి 28 (ఆంధ్రజ్యోతి) : కేసముద్రం స్టేషన్ మస్జీద్‌లో గురువారం రాత్రి బీఆర్ఎస్ మండల మాజీ అధ్యక్షుడు జాటోత్ హరీష్‌నాయక్ ఆధ్వర్యంలో ఇఫ్తార్ విందును ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ సభ్యుడు ఎండీ.అయూబ్‌ఖాన్, ముస్లిం మత పెద్దలు, మస్జీద్ కమిటీ బాధ్యులు పాల్గొన్నారు.

● మరిపెడ, (ఆంధ్రజ్యోతి) : మరిపెడబంగ్లాలోని ఆర్‌అండ్‌బీ గెస్ట్‌హౌస్ దగ్గరి మసీదులో శుక్రవారం రాత్రి మరిపెడ ముస్లింలకు ప్రభుత్వం తరుపున రెవెన్యూ అధికారులు ఇఫ్తార్ విందు ఏర్పాటు చేశారు. జిల్లా మైనార్టీ సంక్షేమ అధికారి శ్రీనివాస్ రావు, మరిపెడ తహసీల్దార్ డి.సైదులు, ఆర్ఐ శరత్, ముస్లిం మత పెద్దలు, మైనార్టీ నేతలు పాల్గొన్నారు.

● నెల్లికుదురు, (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని మసీద్‌లో కాంగ్రెస్ మండలనాయకుడు ఆకుతోట సతీష్ ఆధ్వర్యంలో ముస్లింలకు శుక్రవారం రాత్రి ఇఫ్తార్‌విందు ఇచ్చారు. కాంగ్రెస్ నాయకులు రావుల సతీష్, బాలాజీనాయక్, మద్దిరాజేష్, మౌనేందర్, వెన్నం క్రాంతి, లింగమూర్తి, శ్రీకాంత్, మురళీ, సాయి, నరేష్, ముస్లింలు ఎండీ రహిమాన్, పాష, ఆసీఫ్, అఫ్రోజ్, అస్గర్‌అలీ, అబ్దుల్, షకీల్ పాల్గొన్నారు.

ఉపాధ్యాయ సమస్యల పరిష్కారానికి కృషి

● ఎమ్మెల్సీ పింగళి శ్రీపాల్‌రెడ్డి

నర్సింహులపేట, మార్చి 28 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ పెద్దలతో సమన్వయంగా వ్యవహరించి ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి తనవంతు కృషి చేస్తానని ఉపాధ్యాయ ఎమ్మెల్సీ పింగళి శ్రీపాల్‌రెడ్డి అన్నారు. పీఆర్‌టీయూ నర్సింహులపేట మండల అధ్యక్షుడు ఎర్ర పూర్ణచందర్ ఆధ్వర్యంలో శుక్రవారం ఘన స్వాగతం పలికి టపాసులు పేలుస్తూ ద్విచక్రవాహనాలపై ర్యాలీగా బయలు దేరారు. అంబేద్కర్ విగ్రహానికి పూల మాలవేసి నివాళి అర్పించారు. స్థానిక వేంకటేశ్వర దేవస్థానం ఆవరణలో ఏర్పాటు చేసిన మండలంలోని లోక్యాతండా ఎంపీపీఎస్ పాఠశాల హెచ్‌ఎం శ్రీనివాసస్వామి ఉద్యోగ విరమణ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరై దంపతులను ఘనంగా సన్మానించారు. పీఆర్‌టీయూ రాష్ట్ర అధ్యక్షుడు జి.లక్ష్మణ్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దామోదర్ రెడ్డి, జిల్లా అధ్యక్షుడు సంకపల్లి బద్రినారాయణ, మండల అధ్యక్షుడు ఎర్ర పూర్ణచందర్, ప్రధాన కార్యదర్శి సంజీవ, ఎంఈవో రామ్మోహన్‌రావు, శ్రీనివాస్ రెడ్డి, ఒ.వెంకటయ్య, ఎల్లారెడ్డి, చంద్రమౌళి, శేఖర్, వీరేందర్, నర్సింహారెడ్డి, వెంకట్‌రెడ్డి, మోహన్‌రెడ్డి, శ్రీను, సుమన్, సీఆర్‌పీలు పాల్గొన్నారు.

భూ తగదాల కేసులో ఒకరి అరెస్టు

పెద్దవంగర, మార్చి 28 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని గంట్లకుంట గ్రామానికి ఓ వ్యక్తిని భూతగదాల కేసులో ఒకరు అరెస్టు చేసి జైలు తరలించినట్లు శుక్రవారం రాత్రి ఎస్సై క్రాంతికిరణ్ తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం. గంట్లకుంట గ్రామంలో గత నెలరోజులుగా అన్నదమ్ముల మధ్య జరుగుతున్న భూమి తగాదాలలో కొండ సమ్మయ్యను వ్యక్తిని తన వ్యవసాయాలోనికి పోకుండా అడ్డుకుంటూ దూషిస్తూ కొట్టడానికి ప్రయత్నించేస్తూ చంపుతాని బెదిరిస్తూ తన అన్న భూమిని కాజేయాలని చూస్తున్న కొండ సతీష్‌ను అరెస్టు చేసి జైలకు తరలించినట్లు తెలిపారు.